
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
గురువారం 6 ఫిబ్రవరి 2025





రూ.6.83 కోట్లు వ్యర్థమే

- రైతుసేవా కేంద్రాల్లో మూలనపడిన కియోస్క్ యంత్రాలు
- ఎరువులు, పురుగు మందుల వివరాలు నమోదుకు ఏర్పాటు



● రైతు సేవా కేంద్రంలో పనికి రాకుండా ఉన్న కియోస్క్ యంత్రం

అవగాహన లేక..వాడకపోవడంతో ప్రజాధనం నిరుపయోగం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో ప్రజాధనం ఏ స్థాయిలో దుర్వినియోగం అయ్యిందో ఒక్కొక్క ఉదంతం రుజువు చేస్తోంది. ప్రజలకు అవసరం ఉన్నా లేకున్నా కేవలం కమీషన్ ల కోసమే కోట్ల రూపాయలు బూడిద పాలు చేసినట్లు అర్థం అవుతోంది. గత ఐదేళ్ల కాలంలో వ్యవసాయ శాఖలో రైతులకు ఏ మాత్రం ప్రయోజనం లేని పనులతో ఖజానాకు భారీగానే గండి కొట్టారు. రైతు సేవా కేంద్రాల్లో (అప్పటి రైతు భరోసా కేంద్రాలు) ఎందుకు పనికి రాకుండా పడి ఉన్న కియోస్క్ యంత్రాలను చూస్తే ఆ విషయం అర్థం అవుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు కియోస్క్ యంత్రాలు ఏ స్థాయిలో ఉపయోగ పడతాయో అన్న విషయం ఆలోచించకుండానే ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన మరుసటి రోజు నుంచే అవి నిరుపయోగంగా మారిపోయాయి.

ఉద్దేశం ఏమిటి..

కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేసేటప్పుడు జగన్ ప్రభుత్వం తెగ గొప్పలు చెప్పింది. రైతులు రైతు సేవా కేంద్రాలకు వచ్చి వారికి అవసరం అయిన ఎరువులు,పురుగు మందుల వివరాలు కియోస్క్ యంత్రంలో నమోదు చేస్తే వాటిని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. కానీ వాస్తవంగా రైతులకు వాటిని వినియోగించే విధానంపై తగిన శిక్షణ ఇవ్వలేదు. అసలు కియోస్క్ యంత్రం ఎలా వినియోగించాలో సచివాలయంలో పని చేసే సిబ్బందికే తెలియదు. చాలా చోట్ల ఆకారానికి యంత్రాలు కనిపిస్తున్నా కనెక్షన్లు మాత్రం ఇవ్వలేదు.

> **ప్రజాధనం బూడిద పాలు..**
>
> ఉమ్మడి గుంటూరు జిల్లాలో 858 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఒక్కొక్క కియోస్క్ యంత్రం ధర రూ. 79,668 వరకు ఉంది.2021 నుంచి 2022 వరకు వివిధ దశల్లో వీటిని అన్ని రైతు సేవా కేంద్రాలకు ఏర్పాటు చేశారు. ఒక్క ఉమ్మడి గుంటూరు జిల్లాలో నే వీటి కోసం రూ. 6,83,55,144 లను ఖర్చు చేశారు.

ఇంటికే ఎరువులు...

కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేసే సమయంలో అప్పటి ప్రభుత్వం మరో విషయం చెప్పింది. తనకు ఎంత మేరకు ఎరువులు, పురుగు మందులు కావాలో రైతులు ఈ యంత్రంలో నమోదు చేస్తే వాటిని ఇంటికే సరఫరా చేస్తామని గొప్పలు చెప్పింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏ ఒక్క రైతుకు ఇంటికి ఒక్క బస్తా ఎరువు ఈ విధానంలో సరఫరా కాలేదు.

ఇదీ ప్రస్తుత దుస్థితి..

ఉమ్మడి జిల్లా లోని రైతు సేవా కేంద్రాల్లో ఉన్న కియోస్క్ యంత్రాలు మూలనపడి ఉన్నాయి. వాటి స్థానంలో కంప్యూటర్‌లు ఇచ్చి ఉంటే బాగుండేది అని వ్యవసాయ సిబ్బంది అంటున్నారు. ప్రస్తుతం రైతులకు అవసరం అయిన ఎరువులు, పురుగు మందులు సెల్ ఫోన్‌లోనే వ్యవసాయ సిబ్బంది నమోదు చేస్తున్నారు. వాటికి అవసరం అయిన నెట్‌బిల్ అయినా ప్రభుత్వం ఇస్తే బాగుంటుందని కోరుతున్నారు.

ఏపీ ఆగ్రోస్..

ఏపీ ఆగ్రోస్‌లో కీలకమైన పాత్ర పోషించిన అధికారి ఈ కియోస్క్ యంత్రాలు ప్రవేశపెట్టినట్లు తెలుస్తోంది. ఆయన సలహాతోనే ప్రభుత్వంలో కీలకమైన పాత్ర పోషించిన నేత వాటిని సరఫరా చేసినట్లు చెబుతున్నారు. ఏపీ ఆగ్రోస్ ఉన్న ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ద్వారా రూ. కోట్లు చేతులు మారటంతో ఈ పనికిరాని యంత్రాలు రైతుసేవా కేంద్రాలకు చేరాయని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

సేద్యానికి..డ్రోన్లు

- సమయం ఆదా.. ఖర్చుల్లో మిగులు
- సాంకేతిక వ్యవసాయంపై ప్రభుత్వం దృష్టి
- తొలుత మండలానికి ఓ యూనిట్ మంజూరు
- ఇప్పటికే గ్రూపుల ఎంపిక పూర్తి.. శిక్షణకు సన్నాహాలు

వ్యవసాయానికి.. సాంకేతిక సాయం. పురుగుల మందు పిచి కారీ చేస్తూ.. ఎరువులు వేస్తూ.. మా నవ వనరుల కొరతను తీరుస్తూ.. ఐదు గంటల్లో నలుగురు కూలీలు చేసే పనిని గంటలో ఒక్కరితోనే చేస్తూ.. పంట పొలాల్లో డ్రోన్లు సందడి చేయనున్నాయి. సమయం ఆదా.. కూలీల కొరత.. పెట్టుబడిలో మిగులు డ్రోన్ల సేద్యంతో సాధ్యమని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలి అడుగుగా సేద్యంలో డ్రోన్ల సేవలను వినియోగించుకునే దిశగా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. తొలి విడతలో మండలానికి ఓ గ్రామాన్ని ఎంపిక చేసుకుని అక్కడ రైతులకు సాయంగా డ్రోన్లు వినియోగాన్ని అధికారు లు అందుబాటులోకి తేనున్నారు. దశలవారీగా అన్ని గ్రామాల్లోని రైతులకు డ్రోన్ల సేవలు అందేలా కార్యాచరణ రూపొందించారు. డ్రోన్ ఆపరేటింగ్‌కు సంబంధించి పైలెట్‌కు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని గుంటూరు, నరసరావుపేట, బాపట్ల కలెక్టరేట్ల వేదికగా చేపట్టడానికి వ్యవసాయ శాఖ సన్నాహాలు చేస్తోంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని వాటిని వ్యవసాయంలోకి కూడా ప్రవేశపెట్టి రైతులను సిద్ధం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. వ్యవసాయంలో సంప్రదాయ విధానాలను వీడి లాభసాటి మార్గాలను అన్వేషించడంతో పాటు ఆ మెలకువలను రైతులకు శిక్షణ రూపంలో ఇవ్వడానికి కూడా వ్యవసాయ శాఖ సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో ఆధునిక సాంకేతికతకు నెలవుగా నిలుస్తోన్న డ్రోన్లను వ్యవసాయానికి ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతులకు అన్ని విధాల అండగా ఉపయోగపడేలా డ్రోన్లను రూపొందిస్తున్నారు. సేద్యం నానాటికి భారమవ్వడం వెనుక పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరగడం ప్రధాన కారణంగా ఉంది. ముఖ్యంగా మానవవనరుల కొరత ఉండడంతో కూలి ఖర్చులు మోయలేనంతగా రైతులను కుదేలు చేస్తున్నాయి. డ్రోన్లను సమర్థంగా వినియోగించుకోగలిగితే ఎంతో (మిగతా 8వ పేజీలో)

> **50 శాతం సబ్సిడీ..**
>
> డ్రోన్ యూనిట్ వ్యయం గరిష్ఠంగా రూ.15 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 50 శాతం బ్యాంకు రుణ సదుపాయం అందించనుండగా, 40 శాతం రాయితీ రూపంలో ప్రభుత్వం ఇవ్వనుంది. మిగిలిన పది శాతం గ్రూపులోని రైతులు భరించేలా మార్గదర్శకాలు రూపొందించారు. గ్రూపులోని రైతులు తమ అవసరాలకు డ్రోన్‌ను వినియోగించుకుని ఆ తర్వాత నామమాత్రపు అద్దెకు ఇచ్చే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. తద్వారా ఆ గ్రూపులోని రైతులకు ఆదాయం కూడా సమకూరనున్నది.

> **అవస్థలు పోయి.. ఆదాయం**
>
> పురుగు మందులు, ఎరువుల పిచికారీ సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా గడచిన ఐదేళ్లలో పది మంది వరకు మృతి చెందారు. సేద్యంలోకి డ్రోన్లు రావడం వల్ల రైతులకు నేరుగా పురుగు మందులు కొట్టే అవస్థ తప్పనుంది. డ్రోన్లు దక్కించుకున్న గ్రూపులోని రైతులు తమ అవసరాలకు వాడు కోవడంతో పాటు ఇతర రైతులకు అద్దెకు ఇవ్వాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో తెలిపింది. ఎకరాకు రూ.400 వరకు అద్దె వసూలు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.



కుంభమేళాకు ఆర్టీసీ స్పెషల్ బస్సు

● టిక్కెట్ ధర రూ. 8,300



నగరవనంలో.. శిల్ప సోయగం


పట్టభద్రులను ప్రభావితం చేస్తే చర్యలు

● ఎమ్మెల్సీ ఎన్నికల ఆర్వో నాగలక్ష్మి

ఆరు జిల్లాల్లో.. అనుమతులంటే ఎలా?

● సతమతమవుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులు

8



నదుల అనుసంధానంపై "కదలిక"

- ఎత్తిపోతల నిర్మాణానికి భూముల పరిశీలన
- ఎర్రబాలెం వద్ద పనులను పరిశీలించిన జేసీ సూరజ్
- భూమి సేకరించేందుకు రెవెన్యూ శాఖ ఏర్పాట్లు

(నరసరావుపేట, క్రోసూరు - ఆంధ్రజ్యోతి)

నదుల అనుసంధానంపై కదలిక వచ్చింది. జలహారతి పథకం తొలివిడతలో సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలను తరలించనున్నారు. ఆయా పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో కాంట్రాక్ట్ సంస్థ మెగా ఇంజనీర్లతో కలసి పల్నాడు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌ఘనోరే అమరావతి మండలం వైకుంఠపురం, క్రోసూరు మండలం పీసపాడు గ్రామాల మధ్య పంపు హౌస్ నిర్మాణ పనులను పరిశీలించారు. భూసేకరణపై రెవెన్యూ అధికారులతో చర్చించి అవసరమైన భూములను పరిశీలించారు. ఇంజనీర్లకు, కాంట్రాక్ట్ సంస్థకు జేసీ పలు సూచనలు చేశారు. తహసీల్దార్ వేముల వెంకట నాగరాజు, సర్వేయర్ శ్రీధర్, వీఆర్వో ఇబ్రహీం, డీటీ శ్రీనివాసరావులతో పాటు కాంట్రాక్ట్ సంస్థ ఇంజనీరింగ్ నిపుణులు జేసీ వెంట ఉన్నారు. ఈ ప్రక్రియతో అనుసంధానంపై మరో అడుగు పడింది. ఈ పనులను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించగా తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. తాజా గా ఈ పథకం నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పూనుకోవడంతో పను ల్లో కదలిక వచ్చింది. ఎత్తిపోతల పథకంతో పల్నాడు, గుంటూరు, బాప ట్ల, ప్రకాశం జిల్లాల్లోని ఆయకట్టుకు మహర్దశ పట్టనున్నది. పనులను 2026 జూన్ కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

కుడి కాల్వకు గోదారి..

జలహారతి తొలివిడత సాగర్ కుడికాల్వకు గోదావరి జలాలను తరలిస్తారు. జలహారతి తొలి ప్రయోజనం నాగార్జున సాగర్ జవహర్ కుడి కాల్వ ఆయకట్టు రైతులు పొందనున్నారు. నదుల అనుసంధానం తొలుత సాగర్ కుడికాల్వ వరకు చేపట్టనున్నారు. గోదావరి జలాలను బొల్లాపల్లి జలాశయంలో నిల్వ చేసి అక్కడి నుంచి బనకచర్ల రెగ్యులేటర్‌కు తరలించే పనులను మూడు దశలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలిదశలో గోదావరి జలాలు 73 టీఎంసీలు మళ్లించి కుడి కాల్వ ఆయకట్టు 9.61 లక్షల ఎకరాలకు అందించాలన్నది ప్రధాన ఉద్దేశం. ఈ ఎత్తిపోతల పథకానికి 2018లో సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. రూ.6020 కోట్లతో ప్రారంభించగా రూ.1,016 కోట్ల పనులు పూర్తియ్యాయి. ప్రకాశం బ్యారేజీ ఎగువన మూడు పంపు హౌస్‌లు నిర్మించడంతో పాటు ఆరు వరసల్లో 4.57 కిమీ మేర పైపులు ఏర్పాటు చేసి నీటిని మళ్లిస్తారు. అక్కడి నుంచి 40 కిమీ పైగా కాల్వ తవ్వాల్సి ఉంది. మూడు సబ్ స్టేషన్లు నిర్మించాలి. రెండో ప్యాకేజీలో రెండు పంపుహౌస్‌లు నిర్మించాలి. 5.65 కిమీ మేర ఆరు వరసల పైపులు ఏర్పాటు చేయాలి. మరో 15.95 కిలోమీటర్లు కాల్వ తవ్వాలి. రెండు సబ్‌స్టేషన్లు నిర్మించాలి. ఈ ప్యాకేజీలోరూ.550 కోట్ల పనులు పూర్తి చేశారు. మరో 2,105.82 కోట్ల పనులు చేయాల్సి ఉంది. రెండు ప్యాకేజీలకు సంబంధించి సుమారు 466 ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉంది. భూసేకరణ త్వరలో నే ప్రారంభం కానున్నది. 466 ఎకరాల భూమి అవసరమవుతుందని రెవెన్యూ అధికారు లు అంచనా వేసి సర్వే చేశారు. అ మరావతి, క్రోసూరు, రాజుపాలెం మండలాల గుండా నకరికల్లు మం డలంలోని కుడి ప్రధాన కాల్వలో నీటిని కలుపుతారు. ఆయా మండలాల పరిధిలో భూసేకరణకు రూ.1,044 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. అమరావతి మండలం వైకుంఠ పురం వద్ద కృష్ణానది నుంచి నీటిని, అక్కడి నుంచి 66.59 కిలోమీటర్ల పొడవునా పైపులైన్ నిర్మించి సాగర్ కాల్వ 80వ మైలు వద్దకు గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా తరలించేందు కు పథకాన్ని రూపొందించారు. 56.50 కిలోమీటర్లు గురుత్వాకర్షణ ద్వారా నీటిని తరలిస్తారు. 10.09 కిలోమీటర్లు ఎత్తిపోతల ద్వారా నీటిని కుడి కాల్వకు తరలిస్తారు.



పథకం ప్లాన్‌ను పరిశీలిస్తున్న జేసీ సూరజ్



సౌత్ సెంట్రల్ నుంచి సౌత్ కోస్టుకు

- జోన్ మారనున్న గుంటూరు రైల్వే డివిజన్
- దక్షిణ మధ్య రైల్వేతో వీడిపోనున్న 30 ఏళ్ల బంధం

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ సౌత్ సెంట్రల్ నుంచి సౌత్ కోస్టు జోన్‌లోకి మారనున్నది. ఇంచుమించు మూడు దశాబ్దాల పాటు దక్షిణ మధ్య రైల్వే(ఎస్‌సీఆర్) జోన్‌తో బంధం త్వరలో వీడిపోనున్నది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో హామీ మేరకు కొత్త రైల్వే జోన్ దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ని కేంద్ర రైల్వేబోర్డు నేటిపై చేసిన దృష్ట్యా ఇందులోకి మారబోతున్నది. విశాఖపట్టణం హెడ్‌క్వార్టర్స్‌గా సౌత్ కోస్టు రైల్వే జోన్ ఏర్పాటు కానున్నది. ఇప్పటివరకు డివిజన్‌పై దక్షిణ మధ్య రైల్వే జోన్ చిన్న చూపు చూస్తూ వచ్చింది. ఒకదశలో సంక్రాంతి, దసరా వంటి పండుగల రద్దీ సమయంలోనూ గుంటూరు మీదగా స్పెషల్స్ నడిపేది కాదు. ఇప్పుడు ఎలక్ట్రిక్ ట్రాక్షన్ అందుబాటులోకి వచ్చాక పరిస్థితిలో కొంత మెరుగైంది. త్వరలో విశాఖ హెడ్‌క్వార్టర్స్‌గా ఉండే సౌత్ కోస్టు రైల్వే జోన్‌లోకి గుంటూరు డివిజన్ మారి పోతుండటంతో ఇక ప్రాధాన్యాలు పెరుగుతాయని అంతా ఆశిస్తున్నారు. నిధుల కేటాయింపులు కూడా పెరుగుతా యన్నఅభిప్రాయాన్ని రైల్వేవర్గాలు వ్యక్తపరుస్తున్నాయి.

గుంటూరు డివిజన్ ఇలా..

ఎంపీల పోరాటాల అనంతరం గుంటూరు రైల్వే డివిజన్‌ని విజయవాడ నుంచి వేరు చేస్తూ 1995-96లో కేంద్ర రైల్వే శాఖ మం జూరు చేసింది. అయితే డివిజన్ ఆపరేష నల్‌కి దాదాపుగా ఎనిమిదేళ్లు పట్టింది. 2003 ఏప్రిల్ 1న అధికారికంగా గుంటూరు హెడ్‌క్వార్టర్స్‌గా ఏర్ప డింది. కృష్ణా కెనాల్ - గుంటూరు, గుంటూరు - నంద్యాల, రేపల్లె - తెనాలి, తెనాలి - గుంటూరు, గుంటూరు - పగి డిపల్లి, నడికుడి - మాచర్ల, విష్ణుపురం - జాన్‌పహాడ్, నంద్యాల - యర్రగుంట్ల, కొత్తగా నడికుడి - శ్రీకాళహస్తి సెక్షన్లతో డివిజన్ ఏర్పడింది. గుంటూరు రైల్వే డివిజన్ రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నది. గుంటూరులో 288.87 కిలోమీటర్లు, ప్రకాశం జిల్లాలో 156.70, కర్నూలులో 42.01, నల్గొండలో 102.64, యాదాద్రిలో 38.3, సూర్యపేటలో 4 కిలోమీటర్ల రైల్వేట్రాక్‌ని కలిగి ఉన్నది. త్వరలో అమరావతి రాజధానికి రైలుమార్గం(ఎర్రుపాలెం-నంబూరు) ఏర్పాటు కా బోతున్నది. అయితే ఈ సెక్షన్‌ని అటు విజయవాడకు కేటాయిస్తారా... ఇటు గుంటూరు డివిజన్‌కి ఇస్తారా అన్న దానిపై రైల్వే శాఖ ఇంకా స్పష్టత ఇవ్వలేదు. చిట్యాల, నల్గొండ, మిర్యాలగూడ, విష్ణుపురం, నడికుడి, పొందుగుల, రెడ్డిపాలెం గూడ్స్‌షెడ్లు, నరసరావుపేట, నంద్యాల, జాన్ పహాడ్, నల్లపాడు(ఆర్ఎంసీ), శావల్యాపురం, వినుకొండ, దొనకొండలో సరుకు రవాణా సదు పాయాలు ఉన్నాయి. సిమెంట్ రవాణా కోసం విష్ణుపురం, జానపహాడ్‌లో మూడు కంపెనీలకు సైడింగ్‌లున్నాయి. గుంటూరులో ఒక కాన్‌కోర్ సైడింగ్ ఉన్నది. దీనికి అదనంగా నాగిరెడ్డిపల్లిలో ప్రైవేటు ఫ్రైట్ టెర్మినల్స్ కూడా ఉన్నాయి.

డివి జన్ పరిధిలో 75 స్టేషన్లు ఉన్నాయి. వీటిల్లో ఏ1 కేటిగిరీలో గుంటూరు, బీ కేటిగిరీలో నంద్యాల, నల్గొండ ఉన్నాయి. మరో 13 డీ కేటిగిరీలో, 43 ఈ, 13 ఎఫ్, నాన్ ఆపరేషనల్ నాలుగు స్టేషన్లు ఉన్నాయి. ప్రస్తుతానికి గుంటూరు - కృష్ణాకెనాల్, గుంటూరు - తెనాలి డబ్లింగ్ పూర్తి అయ్యాయి. గుంటూరు - నంద్యాల సెక్షన్ దాదాపుగా పూర్తి కావొచ్చింది. నల్లపాడు-బీబీనగర్ డబ్లింగ్ పనులు ప్రారంభమయ్యాయి. 96 శాతం రైలు మార్గాలు విద్యుద్దీకరణ జరిగాయి. రైళ్ల రాకపోకలు అధికంగా ఉండే డివిజన్లలో గుంటూరు రైల్వే డివిజన్ ఒకటి. కాగా గుంటూరు నుంచి బయలుదేరడం, వేరే ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి ఆగిపోవ డం, దూరప్రాంతాల నుంచి గుంటూరు మీదగా రాకపోకలు సాగించే రెగ్యులర్, వీక్లీ, బైవీక్లీ, ట్రైవీక్లీ కలుపుకుని 200లకు పైగానే ఉన్నాయి.

ఆ సెక్షన్ కోల్పోతే నష్టం

దక్షిణ కోస్తా జోన్‌ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దులకే పరిమితం చేసే అవకాశాలు ఉన్నాయి. అలా జరిగితే గుంటూరు రైల్వే డివిజన్‌కు అపారనష్టం వాటిల్లబోతున్నది. ఇందుకు కారణం.. గుంటూరు డివిజన్‌కు సరుకు రవాణా ద్వారా వచ్చే ఆదాయం తెలంగాణలోని పగిడిపల్లి - విష్ణుపురం - జాన్‌పహాడ్ సెక్షన్‌లోనే ఉన్నది. డివిజన్ పరిధి పునర్ వ్యవస్థీకరణలో ఆ సెక్షన్ కోల్పోతే గుంటూరు డివిజన్‌కు అపార నష్టం వాటిల్లనున్నది. సిమెంట్, ఎఫ్‌సీఐ గోదాములు, ప్రైవేటు సైడింగ్స్ వంటివి విష్ణుపురం, జాన్‌పహాడ్, మిర్యాలగూడ, నల్గొండ, చిట్యాల, నాగిరెడ్డిపల్లి వద్ద కేంద్రీకృతమై ఉన్నాయి. ఇప్పుడు గుంటూరు డివిజన్ నుంచి వాటిని వేరు చేస్తే సరుకు రవాణా ఆదాయం 80 శాతం వరకు కోల్పోయే ప్రమాదం ఉన్నది. దీనిని ఈ ప్రాంత ఎంపీలు గట్టిగా వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

విద్యుత్ వినియోగం.. పైపైకి

ఐదు మిలియన్ యూనిట్ల వాడకం

- వేసవి రాకుండానే పెరుగుతోన్న డిమాండ్
- రానున్న రోజుల్లో డిమాండ్ పెరిగే అవకాశం



గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వేసవికి ముందే జిల్లాలో విద్యుత్ వినియోగం క్రమంగా పెరుగుతోంది. మండుతోన్న ఎండలకు తోడు విద్యుత్ వినియోగం పైపైకి చేరుతోంది. ఇప్పుడే ఇలా ఉంటే వేసవిలో మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గుంటూరు సర్కిల్ పరిధిలో గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్ పరిధిలో విద్యుత్ వినియోగం ఇటీవల అమాంతం పెరిగింది. గత నెల 25న గుంటూరు, తెనాలి డివిజన్‌లలో 4.647 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంది. ఈ నెల 4న వినియోగం పరిశీలిస్తే 4.935 మిలియన్ యూనిట్లు అంటే దాదాపు ఐదు మిలియన్ యూనిట్లకు చేరింది.

ప్రస్తుతం జిల్లాలో కోటాకు అనుగుణంగా విద్యుత్ డిమాండ్ ఉందని అయితే రానున్న రోజుల్లో పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. నాలుగైదు రోజుల నుంచి పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం కూడా ఆ స్థాయిలో పెరిగింది. మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుందని ఆ శాఖ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం ఎయిర్ కండీషనర్లు, కూలర్లు, రాత్రి సమయాల్లో గీజర్లు, ఏసీల వినియోగం పెరగడం విద్యుత్ డిమాండ్ పెరుగుదలకు కారణాలుగా చెబుతున్నారు.

> **వేసవిలో మరింతగా**
>
> ఎండలు పెరుగుతున్న కొద్దీ విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది. వేసవిలో మరింత పెరగనున్నది. ఇందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుతం కోటాకు అనుగుణంగా విద్యుత్ వినియోగం ఉంది. ఎటువంటి ఇబ్బంది లేదు. వేసవిలో ఎటువంటి సాంకేతిక అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.
>
> 
>
> **కేవీఎల్ఎన్ మూర్తి, ఆపరేషన్ ఇన్‌చార్జి ఎస్ఈ, గుంటూరు సర్కిల్**

ఉమ్మడి పరిశోధనలకు ఒప్పందం


ఒప్పంద పత్రాలను చూపిస్తున్న వీవీఐటీ, చెన్నై కళాశాలల ప్రతినిధులు

పెదకాకాని, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ సాంకేతిక అధ్యాపకుల శిక్షణ, పరిశోధన సంస్థ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్, చెన్నై), వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మధ్య అధ్యాపకులు, విద్యార్థులలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం, సాంకేతిక విద్యా, పరిశోధనా, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించేలా అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బుధవారం తెలిపారు. ఎన్.ఐ.టి.టి.టి.ఆర్ చెన్నైలో ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఉషా నటేషన్, వీవీఐటీ డైరెక్టర్ డాక్టర్ రావెల నవీన్ మధ్య ఈ ఒప్పంద మార్పిడి జరిగిందని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా ఉమ్మడి పరిశోధనా ప్రాజెక్టులు, సాంకేతిక విద్యా నాణ్యత పెంపు, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ వంటి అంశాలలో సహకారం అందుతుందని వివరించారు. పాఠ్యాంశ అభివృద్ధి, ప్రశ్నపత్రం సెట్టింగ్, నిరంతర మూల్యాంకన పద్ధతులు, విద్యా ఆడిట్, అక్రిడిటేషన్ రంగాలలో శిక్షణ ఉంటుందన్నారు. రెండు సంస్థలు కలిసి దేశవ్యాప్తంగా ఉన్న సాంకేతిక అధ్యాపకులకు అభివృద్ధి చెందుతున్న సాంకేతిక అంశాలపై శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 23 మందికి ఉద్యోగాలు

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో రినెక్స్ టెక్నాలజీ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపస్ ఇంటర్వ్యూలో 23 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని వివరించారు. ఎంపికైన వారికి ఇంటర్న్‌షిప్ సమయంలో రూ.25 వేలు స్టైపెండ్, ప్రతిభ ఆధారంగా రూ.10 లక్షల వార్షిక వేతనం అందిస్తారని తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్, కె.మద్దినేని తదితరులు అభినందించారు.

మద్యం దుకాణాల దరఖాస్తులకు గడువు పొడిగింపు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గౌడ, గౌడ్ సంఘీయుల మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువు ఈ నెల 8వ తేదీ వరకు పొడిగించినట్లు గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు బుధవారం తెలిపారు. గత నెల 27న రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 5వ తేదీతో మద్యం షాపుల దరఖాస్తు గడువు ముగిసిందన్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల ప్రక్రియను ఈ నెల 8వ తేదీ వరకు పొడిగించిందని తెలిపారు. గుంటూరు జిల్లాలో 13, పల్నాడు జిల్లాలో 13 చొప్పున రెండు జిల్లాలలో 26 మద్యం షాపులకు టెండర్లు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 10న దుకాణాలకు లాటరీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

చేయి తడపాల్సిందే!

- కమీషన్ల కోసం పెండింగ్‌లో ఫైళ్లు
- మీటింగ్ బిల్లుల పేరుతో అధికారుల ఈటింగ్
- ఇదీ జడ్పీలోని అధికారుల అవినీతి తీరు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గతేడాది అక్టోబర్ 3న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఏర్పాట్లకు సంబంధించిన బిల్లులు లక్షల్లో ఉన్నాయి. ఇంతవరకు ఒక్క రూపాయి చెల్లింపు జరగలేదు. కారణం జిల్లా పరిషత్‌లో నిధుల్లేక కాదు. కమీషన్ల వ్యవహారం కొలిక్కి కాక. ఆ బిల్లులు చెల్లించాలంటే గట్టిగా నలుగురు, ఐదుగురికి చేతులు తడపాలి. ఆ పని కాలేదు కనుక మూడు నెలలు దాటినా బిల్లుల చెల్లింపు వ్యవహారం జడ్పీ చుట్టూ గింగిరాలు తిరుగుతుంది. ఈ ఒక్క బిల్లులే కాదు. జడ్పీలో ఏ బిల్లుకు మోక్షం కలగాలన్నా చివరిగా మనీ మంత్రం పడాల్సిందే.

మీటింగ్ బిల్లుల పేరిట అవినీతి

గుంటూరు జిల్లా పరిషత్‌లో సర్వసభ్య సమావేశాలు పేరిట భారీ అవినీతి జరుగుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి మూడు నెలలకొకసారి జరిగే సర్వసభ్య సమావేశం పేరుతో రూ.3 లక్షల నుంచి రూ. 6 లక్షల వరకు జడ్పీ నిధులను డ్రా చేస్తున్నారు. గతంలో మరింత ఎక్కువ మొత్తంలో డ్రా చేసేవారు. సర్వసభ్య సమావేశం పేరుతో డ్రా చేసే నిధుల్లో ఎక్కువ భాగం ముఖ్యుల జేబుల్లోకి వెళ్లాయన్న ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో నాలుగు స్థాయిల్లో ఈ నిధులకు సంబంధించిన పంపకాలు జరిగేవి. ఆ బిల్లుల వ్యవహారం చూసే కీలకమైన ఉద్యోగి చేతుల మీదుగా అందరికీ కవర్లు అందేవన్న ప్రచారం ఉంది. ఇన్ని స్థాయిల్లో పంపకాలు జరగాలి కనుక సర్వసభ్య సమావేశం బిల్లు కూడా భారీగా పెరిగిపోయేది. ఇప్పుడు కూడా తూచా తప్పకుండా అదే జరుగుతోంది.

అన్నిస్థాయిల్లో అదే పరిస్థితి..

జిల్లా పరిషత్‌లోని కొందరిపై తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి. ఎక్కడికి వెళ్లినా ఎంతో కొంత ఇవ్వనిదే పని కావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కనీసం రూ.25 వేలు ఇవ్వాల్సి వస్తుందని ఒక అధికారి వెల్లడించారు. ఇవ్వకపోతే ఇబ్బందులు వస్తాయన్న ఆలోచనతో ముట్టజెప్పాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం జిల్లా పరిషత్‌లో కొన్ని వందల ఫైళ్లు నిలిచిపోయాయి. అవి ఏ స్థాయిలో ఉన్నాయో కూడా చెప్పటం కష్టమేనని కొందరు అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ ముడుపుల శాతం తేలక ఆగిపోయినవేనని చెబుతున్నారు. ఆ విషయం తేలకపోతే ఫైల్ ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. సాధారణంగా బిల్లు చెల్లింపు కోసం కాంట్రాక్టర్లు ఎక్కడో ఒకచోట కొంతవరకు ముట్టచెబుతారు. ఇక్కడ మాత్రం అన్ని చోట్లా ఇవ్వాల్సి వస్తుందని ఒక కాంట్రాక్టర్ చెప్పారు.

48 కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు

- కలెక్టర్ పి.అరుణ్ బాబు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి నీలావతి దేవి

నరసరావుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ పరీక్షలకు 48 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలిపారు. కలెక్టరేట్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 32,434 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. వీరిలో 17,905 మంది మొదటి సంవత్సరం, 14,529 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఉన్నారని వివరించారు. మరో 2117 మంది విద్యార్థులు ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్నారని తెలిపారు. 9 కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒక హెల్త్‌అసిస్టెంట్‌ను అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఏ పరీక్షా కేంద్రానికి అయినా చేరుకునే విధంగా కీలక ప్రాంతాల్లో మెడికల్ వ్యాన్లను సిద్ధంగా ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా బస్సులు నిర్వహించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. సమావేశంలో డీఆర్వో మురళి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి నీలావతి దేవి, డీఈవో చంద్రకళ, డీఎంహెచ్ఓ రవి, మున్సిపల్ కమిషనర్ జస్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

ఇంటర్ ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు బుధవారం ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 11 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్ పరీక్షలకు 617 మంది హాజరు కాగా 89 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో నీలావతి దేవి తెలిపారు. సాయంత్రం 10 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 502 మంది హాజరు కాగా 39 మంది గైర్హాజరయ్యారని చెప్పారు.

ఆలపాటిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. బుధవారం అమరావతిలోని ఏవీఆర్ కన్వెన్షన్ హాలులో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గ స్థాయి ఉమ్మడి కూటమి నాయకులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మంత్రి గొట్టిపాటి ముఖ్యఅతిథిగా పాల్గొని ఎన్నికల నిర్వహణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు అధ్వానంగా మారాయని, కూటమి అధికారంలోకి వచ్చిన 8 నెలల పాలనలో రాష్ట్ర అభివృద్ధితోపాటు సంక్షేమం పరుగులు పెట్టేలా ముఖ్యమంత్రి పాలన చేస్తున్నారన్నారు. త్వరలో నిరుద్యోగ భృతి, తల్లికి వందనం పథకాలు అమల్లోకి రానున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలో పట్టభద్రుల ఓట్లు సుమారు 7.5వేలు ఉన్నాయని, అత్యధిక శాతం కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటికి పోలయ్యేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రతి 30 మంది ఓటర్లకు ఒకరిని పర్యవేక్షకునిగా ఉంచామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నల్లపాటి రాము, కేకే చౌదరి, గుంటూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీవీ వరప్రసాద్, ఎంపీపీ ఎం.హనుమంతరావు, ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సీఎంను విమర్శించే అర్హత జగన్‌కు లేదు

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు


మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడుని విమర్శించే అర్హత జగన్‌కు లేదని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. జగన్ మాట్లాడిన తీరుపై స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జీవీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు 11 సీట్లు ఇచ్చారనీ, కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదనీ, రానున్న రోజుల్లో ఆ ఎమ్మెల్యే పదవి కూడా కోల్పోయి, సీబీఐ కేసుల్లో శిక్ష పడటం ఖాయమని అన్నారు. జగన్ అవినీతి కేసుల్లో 16 నెలలు జైలులో ఉన్నా, రాజశేఖరరెడ్డిపై అభిమానంతో గెలిపించారని, రాష్ట్రానికి సీఎంగా ఉండి నట్టేట ముంచారని విమర్శించారు. ఇసుక, మద్యం గురించి మాట్లాడే అర్హత లేదనీ, ప్రభుత్వ మద్యం షాపులు పెట్టి గ్రామాల్లో బెల్టుషాపుల తెరిపించి లక్షల కోట్లు దోచుకున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎన్డీఏ కూటమికి ప్రజలు జేజేలు పలుకుతున్నారని, గాడితప్పిన వ్యవస్థను సీఎం చంద్రబాబు నాయుడు గాడిలో పెట్టారని, జగన్ ఆత్మ విమర్శ చేసుకుంటే మంచిదని సూచించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పీవీ సురేష్, షమీమ్, గుంటూరు సాంబశివరావు పాల్గొన్నారు.

సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా రీసర్వే

పెదకాకాని, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చట్టపరిధికి లోబడి సహజ న్యాయ సూత్రాలను అనుసరిస్తూ రీసర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ జి.జయలక్ష్మి స్పష్టం చేశారు. గతంలో జరిగిన తప్పిదాలను అధికమిస్తూ సజావుగా రీసర్వే పూర్తి చేయాలని సూచించారు. బుధవారం గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రీసర్వే డిప్యూటీ తహసీల్దాలకు శిక్షణ, సమీక్ష కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ రీసర్వే డీటీలకు విస్తృత అధికారాలు కల్పించామనీ, వాటిని సమస్యల పరిష్కారానికి వినియోగించాలన్నారు. రెవెన్యూ రికార్డులలో నెలకొన్న లోపాలను అధికమించి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా స్పష్టమైన రికార్డుల రూపకల్పనకు మార్గం సుగమం చేయాలన్నారు. సర్వే సెటిల్మెంట్, భూమి రికార్డుల సంచాలకులు డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, సర్వే సెటిల్మెంట్, భూమి రికార్డుల అదనపు సంచాలకులు గోవిందరావు మాట్లాడుతూ సమస్యలను లోతుగా అవగాహన చేసుకుని పరిష్కారం చూపాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌లు దాదాపు 550 మంది సదస్సుకు హాజరయ్యారు. గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ, కేంద్ర కార్యాలయం ఉప సంచాలకులు డీఎల్ బీఎల్ కుమార్, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కేజియా కుమారి, సహాయ సంచాలకులు ఎంవీ రంగప్రసాద్, ప్రశాంతి, ఏవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల మూల్యాంకనంలో నిబంధనలకు నీళ్లు

నరసరావుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ డిగ్రీ పరీక్షల మూల్యాంకనంలో నిబంధనలు పాటించడం లేదు. మూల్యాంకనంకు నిర్ణీత సమయం కేటాయించడం లేదని తెలిసింది. దీంతో అధ్యాపకులు ఇబ్బందులకు గురవుతున్నట్లు సమాచారం. యూజీసీ ప్రవేశపెట్టిన ఆనర్స్ విధానం కారణంగా పాఠ్యాంశాలు బోధించని అధ్యాపకులు వారికి సంబంధంలేని జవాబు పత్రాలను దిద్దుతున్నట్లు ప్రచారం. మూల్యాంకనంకు రాని అధ్యాపకుని ఐడీ నంబరును ఉపయోగించి బోధనేతర సిబ్బంది చేత జవాబు పత్రాలు దిద్దుస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. నరసరావుపేటలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రంపై పలు ఆరోపణలున్నాయి. డిగ్రీ ఆనర్స్ విధానం వలన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఒక్కొక్క సబ్జెక్టును ఇద్దరు. ముగ్గురు వేర్వేరు సబ్జెక్ట్ అధ్యాపకులు బోధించాలి. దీంతో అయా సబ్జెక్టుల పేపర్ జవాబు పత్రాలను ఏఏ అధ్యాపకులు మూల్యాంకనం చేయాలనే దానిపై వర్సిటీ పరీక్షల విభాగం స్పష్టమైన విధానాన్ని ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో మూల్యాంకన కేంద్రం నిర్వాహకులు అయా పత్రాల మూల్యాంకనం చేసేందుకు కొందరికే ప్రాధాన్యత ఇస్తుండటంతో ఆ పాఠ్యాంశం బోధించిన అధ్యాపకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మల్టీ డిసిప్లీనరీ పేపర్, స్కిల్ పేపర్లను సబ్జెక్ అధ్యాపకులతో సంబంధం లేకుండా మూల్యాంకన చేయిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. మూల్యాంకన కేంద్రంలో లోపాల ప్రభావం విదార్థుల మార్కులపై పడుతుందన్న అభిప్రాయం అధ్యాపకుల నుంచి వ్యక్తమవుతోంది. మూల్యాంకనం 5 నుంచి 6 గంటల పాటు జరగాలి. ఒక్కొక్క అధ్యాపకుడు రోజుకు 30 జవాబు పత్రాలను దిద్దాలి. ఇక్కడి కేంద్రంలో మూల్యాంకనకు కేవలం మూడు గంటలు ఇస్తున్నట్లు సమాచారం. సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సమయం ఇస్తునట్టు పలువురు అధ్యాపకులు చెబుతున్నారు. మూల్యాంకనకు హాజరు కాని అధ్యాపకుల పేరు మీదుగా బిల్లులు చెల్లింపులు జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. యూనివర్సిటీ పరీక్షల విభాగం కో ఆర్డినేటర్ కృష్ణారావును వివరణ అడగ్గా కేంద్రాన్ని తనిఖీ చేస్తామని, తమ విచారణలో అవకతవకలు ఉన్నట్టు వెల్లడైతే తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వర్సిటీలో స్కిల్ ఎకో సిస్టం అభివృద్ధికి చర్యలు


వర్సిటీలో పలు విభాగాలను పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వాణి ప్రసాద్

పెదకాకాని, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మరో నైపుణ్య శిక్షణ కేంద్రానికి వేదిక కానుంది. విద్యార్థులు, యువతకు మెరుగైన నైపుణ్యాలు నేర్పించి వారిని ఉపాధి మార్గాల వైపు పయనించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ విశ్వవిద్యాలయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. లేబర్, బాయిలర్స్ అండ్ ఇన్సూరెన్స్, మెడికల్ సర్వీసెస్, ప్రత్యేక కార్యదర్శి ఎ.వాణి ప్రసాద్, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎస్ఎస్‌డీసీ) ఎండీ, సీఈవో గణేష్ కుమార్‌ల బృందం బుధవారం విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ గంగాధరరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలంతో కలిసి దూరవిద్య కేంద్రాన్ని పరిశీలించారు. స్కిల్ ఓరియంటేషన్, స్కిల్ ఎకో సిస్టమ్ అభివృద్ధి, అందుకు అవసరమైన వసతులు గుర్తించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఏపీఎస్ఎస్‌డీసీలు సంయుక్తంగా చేపట్టాల్సిన పలు స్కిల్ ఇనిషియేటివ్స్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ వీసీ గంగాధరరావు మాట్లాడుతూ వర్సిటీలో స్కిల్ ఎకో సిస్టం ఏర్పాటుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఎస్‌డిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్, దూర విద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

8న నవోదయ ప్రవేశానికి ఎంపిక పరీక్ష

చిలకలూరిపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయం 9, 11 తరగతులలో (లేటరల్ ఎంట్రీ) ప్రవేశానికి ఎంపిక పరీక్ష ఈ నెల 8న నిర్వహిస్తున్నట్లు మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎన్. నరసింహారావు బుధవారం తెలిపారు. మొత్తం 7 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ జరుగుతుందన్నారు. 9వ తరగతి పరీక్షకు 1,372 మంది, 11వ తరగతి పరీక్షకు 695 మంది దరఖాస్తు చేసినట్టు వివరించారు. 9వ తరగతి పరీక్ష చిలకలూరిపేటలోని చౌదరయ్య స్కూలు, శారద హైస్కూల్, ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్, నరసరావుపేటలోని మున్సిపల్ బాలుర హైస్కూల్, శంకరభారతిపురం జడ్పీ హైస్కూల్‌లలో జరుగుతాయని తెలిపారు. 11వ తరగతి పరీక్ష మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయం, చిలకలూరిపేట ఏఎంజీ హైస్కూలులో జరుగుతాయని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చున్నారు. వివరాలకు 90143 07677 నంబరుకు సంప్రదించాలని కోరారు.

గ్రానైట్ లారీ స్వాధీనం


అధికారులు స్వాధీనం చేసుకున్న గ్రానైట్ లారీ

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతి లేకుండా గ్రానైట్ రాయిని తరలిస్తున్న లారీని గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ డి.సూర్య శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు మంగళగిరి కాజా టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా గ్రానైట్ తరలిస్తున్న లారీ తారసపడింది. గ్రానైట్ తరలింపునకు అవసరమైన పత్రాలను చూపించకపోవడంతో అక్రమంగా తరలిస్తున్నట్లు నిర్ధారించారు. లారీని మంగళగిరి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు సీఐ కె.చంద్రశేఖర్ తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతి

మాచర్లటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మాచర్ల పట్టణంలో బుధవారం జరిగింది. గత నెల 27న సుమారు 50 ఏళ్ల వయసున్న ఓ మహిళ పట్టణంలోని చంద్రవంక బ్రిడ్జి వద్ద అపస్మారక స్థితిలో ఉండడాన్ని గుర్తించి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. అనంతరం ఆమెను వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేటకు తరలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 1న మృతి చెందింది. మృతురాలు తెలుపురంగుపై నలుగురంగు డిజైన్ల చీర, ఆకుపచ్చ జాకెట్ ధరించి ఉంది. మృతురాలు వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని పట్టణ ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 548.50 అడుగులు ఉంది. ఇది 206.48 టీఎంసీలకు సమానం. ఔట్‌ఫ్లో వాటర్‌గా 47,705 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123,132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

1,27,321 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 121,569 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,27,321 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 72,162 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	9000	13700	334	9500	11500
నెంబరు. 5	10000	13000	నెంబరు.5	--	--
273	10500	12000	273	--	--
341	10000	15000	341	--	--
4884	9500	12000	4884	--	--
సూపర్ 10	10500	14000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15500	తేజ	11000	14700
బ్యాడిగి	10000	12500	బ్యాడిగి	9000	10000
దేవనూరు డీలక్స్	10000	13500	దేవనూరు డీలక్స్	--	--
తెల్లకాయలు	4000	7500	తెల్లకాయలు	4000	7500

‘ప్రజలను మభ్యపెట్టేలా నూతన బడ్జెట్’

గుంటూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంతా మాటల గారడీతో ప్రజలను మభ్యపెట్టేలా ఉందని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ విమర్శించారు స్థానిక. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కేంద్ర బడ్జెట్‌పై విశ్లేషణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పార్లమెంటులో ఎనిమిదేళ్ళుగా బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న నిర్మలా సీతారామన్ అన్ని బడ్జెట్‌లలో పేదలను విస్మరించారని ఆందోళన వ్యక్తం చేశారు. అదే ఒరవడి కొనసాగిస్తూ మహా సంపన్నుల పట్ల మహా విధేయతను ప్రదర్శించారని విమర్శించారు. ఆర్థికవేత్త డాక్టర్ అబ్బరాజు రాజశేఖర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ పరిణామం, కేటాయింపులు లేవన్నారు. కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, రామారావు, పీ విష్ణు పాల్గొన్నారు.

వామపక్ష నాయకుల నిరసన

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలకు శాపంగా కార్పొరేట్లకు వరంలా మారిన కేంద్ర బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించా లని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలు గూరి రాధాకృష్ణమూర్తి అన్నారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక లాడ్జి సెంటర్ వద్ద బుధవారం వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. నిరసనల్లో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు పలు సంఘాల నాయకులు లక్ష్మణరావు, కూరపాటి కోటయ్య, కంచుమాటి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అధికారులు

అనారోగ్యంతో జాగిలం రాబర్ట్ మృతి

● అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పేలుడు పదార్థాలను పసిగట్టే పోలీస్ జాగిలం రాబర్ట్ బుధవారం అనారోగ్యంతో కన్నుమూసింది. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని జాగిలాల ఖనన కేంద్రంలో అదనపు ఎస్పీ హనుమంతు ఆధ్వర్యంలో అధికార లాంఛనాలతో రాబర్ట్ అంత్యక్రియలు నిర్వహించారు.

వైభవంగా గణపతి స్వామి బ్రహోత్సవాలు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌వీఎన్ కాలనీ లోని విజయ గణపతి స్వామి వారి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, వాస్తు పూజ, వాస్తు హోమం, అగ్ని ప్రణయనం, విశేష హోమం, బలిహరణ తదితర కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. సాయంత్రం శ్రీ సిద్ధిబుద్ధి సమేత విజయ గణపతి స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర హించారు. ఆలయ అధ్యక్షుడు వట్టికూటి పూర్ణచంద్రరావు దంపతులు స్వామి, అమ్మ వార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు.

8న పట్టాభిషేకం

గుంటూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మస్థలం పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ క్షేత్రంలో అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్టు, పెనుగొండ క్షేత్ర పీఠాధిపతిగా తెనాలికి చెందిన శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి)కి ఈనెల 8న జరిగే పట్టాభిషేకం కార్యక్రమానికి పెనుగొండకు ఆర్యవైశ్య వర్గీయులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలస్వామిజీ పట్టాభిషేకం కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈ నెల 6 నుంచే పెనుగొండలో పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

వైభవంగా కల్యాణం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేటలోని శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత ఓంకారక్షేత్రంలో శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం నగర సంకీర్తన, నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం రుక్మిణీ సమేత కృష్ణ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

ప్రలోభాలతో స్టాండింగ్ కమిటీ ఎన్నికలు

● మేయర్ కావటి, అంబటి రాంబాబు

గుంటూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తమ కార్పొరేటర్లను ప్రలోభపరిచినగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరిపి విజయం అనుకోవడం కూటమి నేతలకు సిగ్గుచేటని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు విమర్శించారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని వైసీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో మేయర్ కావటి, డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబులతో కలిసి రాంబాబు మాట్లాడారు. ఐదేళ్ల పాటు పూర్తిస్థాయిలో మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డిప్యూటీ మేయర్‌గా బాలవజ్రబాబు కొనసాగుతారన్నారు. కూటమి నేతలు ఎటువంటి కుట్రలు, పన్నాగాలు పన్నినా తిప్పికొడామన్నారు. మనోహర్‌నాయుడు మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ ఎన్నికల కూటమి నాయకుల గెలుపు గెలుపే కాదన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరగలేదని విమర్శించారు. బాలవజ్రబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. సమావేశంలో వైసీపీ గుంటూరు తూర్పు ఇన్‌చార్జి నూరిఫాతిమా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, కార్పొరేటర్ గోపిశ్రీనివాస్ ఉన్నారు.

‘పాడి’కి ప్రోత్సాహం.. మూగజీవాలకు ఆరోగ్యం

- జిల్లాలో పశువైద్య శిబిరాలు విజయవంతం
- 24 వేల జంతువులకు వైద్య చికిత్సలు
- 15 వేల ఆవులు, గేదెలు, ఎద్దులకు నట్టల నివారణ మందు
- 52 వేల గొర్రెలు, మేకలకు డీవార్మింగ్
- పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహారావు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల జగన్ పాలనలో పాడి పరిశ్రమకు, పశువుల ఆరోగ్య సంరక్షణకు కనీస ఆదరణ కూడా లభించలేదు. అయితే, టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పాడిపరిశ్రమను ప్రోత్సహించడం, నోరు లేని మూగ జీవాలను బతికించాలన్న లక్ష్యంతో పశువైద్య శిబిరాలు నిర్వహించింది. గుంటూరు జిల్లాలో నిర్వహించిన ఈ పశు ఆరోగ్య శిబిరాలు విజయవంతమయ్యాయి. కనీస ఆదరణకు నోచుకోని పశువుల ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా సాగిన ఈ శిబిరాలలో వేలాది జంతువుల కు ప్రయోజనం చేకూరింది. విజయవంతమైన పశు ఆరోగ్య శిబిరాల వివరాలను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ నరసింహారావు బుధవారం వెల్లడించారు. మొత్తం 11 రోజుల పాటు జిల్లాలోని వివిధ గ్రామాల్లో 273 వైద్య శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ శిబిరాలలో 24,110 పశువులకు వివిధ చికిత్సలు చేసినట్లు తెలిపారు. పునరుత్పత్తి (సంతాన లే మి) సమ స్యతో బాధపడుతున్న 2996 పశువులను కూడా పరీక్షించి ప్రత్యేక వైద్యం చేసినట్లు పేర్కొన్నారు. 2,387 ఆవులు, గేదెలకు గర్భనిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, 9,855 దూడలకు నట్టల నివారణ మందును తాపించినట్లు జిల్లా



గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరం

పశు సంవర్ధక శాఖ అధికారి వివరించారు. గతంలో కేవలం గొర్రెలు, మేకలు,దూడలకు మాత్రమే నట్టల నివా రణ మందును తాపించేవారమని, ఈసారి 15090 ఆవులు గేదెలు, ఎద్దులకు కూడా ఈ మందును వేసినట్లు చెప్పారు. 52,016 గొర్రెలు, మేకలకు డీవార్మింగ్ ప్రక్రియ నిర్వహించామని, 31,532 గొర్రెలు, మేకలకు వాక్సిన్ వేసినట్లు వివరించారు. 19,219 కోళ్లకు వాక్సిన్ వేసేందుకు ఈ ఆరోగ్య శిబిరాలు దోహదపడి నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన పశు ఆరోగ్య శిబిరాల వల్ల 8,481 మంది పాడి రైతులకు ప్రయోజనం చేకూరిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం విజయవంతమైనట్లు తెలిపారు.



మెటీరియల్ పంపిణీ చేస్తున్న డీఈఓ సీవీ రేణుక, ఎస్‌టీయూ, ఏఐఎస్‌టీఎఫ్ నాయకులు

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

గుంటూరు (విద్య)ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు శ్రీ తులసి ఎడ్యుకేషనల్ గైడెన్స్ ట్రస్ట్ సౌజన్యంతో స్టడీ మెటీ రియల్ బుధవారం అందజేశారు. స్థానిక కొత్తపేటలోని జలగం రామా రావు మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డీఈఓ సీవీ రేణుక స్టడీ మెటీరియల్ అందజేశారు. ఎస్‌టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఈ స్టడీ మెటీరియల్‌ను రూపొందించారు. అదేవిధంగా పరీక్షల ప్యాడ్,పెన్ను, పౌచులు, పౌష్టికాహార కిట్స్ ట్రస్ట్ సభ్యులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ కే మురళీకృష్ణ, ఎస్‌టీయూ, ఏఐఎస్‌టీఎఫ్ నాయకులు సుధీర్ బాబు, జిల్లా అధ్యక్షుడు పెదబాబు, నగర అధ్యక్షుడు కే వెంకయ్య, ప్రధాన కార్యదర్శి ఉగ్గం మహంకాళరావు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి కేసులు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ సంతృప్తికరంగా జరుగుతున్నట్లు జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన ప్రోగ్రామ్ ఏపీ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ తెలిపారు. స్థానిక కొండా వెంకటప్పయ్య కాలనీలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. అక్కడ రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో లెప్రసీ సర్వేపై సమీక్ష నిర్వహించారు. దేవసాగర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 95 మంది కుష్ఠు వ్యాధి గ్రస్తులు చికిత్సలు పొందుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ తమ పరిధిలో కుష్ఠు వ్యాధి కేసుల సంఖ్య పెరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీ లక్ష్మా నాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న లెప్రసీ కేసుల గుర్తింపు ప్రత్యేక కార్యక్రమంలో 80 శాతం స్క్రీనింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ నెల 12లోపు మిగిలిన 20 శాతం స్క్రీనింగ్‌ను కూడా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లు జే బసవయ్య, హాస్సేన్, హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ పరిమళ పాల్గొన్నారు.

బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి: మధుకర్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సంఘటన్ మంత్రి నూకల మధుకర్ జీ అన్నారు. స్థానిక లాలుపురంలో బుధవారం జిల్లా కార్యాలయంలో నూత నంగా ఎన్నికైన మండల అధ్యక్షులతో జిల్లా పదాధికారుల సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు పాల్గొన్నారు.

7 నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్ల వేంకటేశ్వర స్వామి దేవస్థాన సొసైటీ (పెద్ద గుడి) 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 7 నుంచి 10 వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ కంచర్ల ఆంజనేయులు తెలిపారు. ఉత్సవాలకరపత్రాలను ఆలయ ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు.

ఓంకార మహాయజ్ఞంపై ప్రవచనం

స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికపై బుధవారం ఓంకార మహాయజ్ఞంపై ప్రణవ ఆశ్రమం వ్యవస్థాపకుడు స్వామినీ సుమిత్రానంద సర్వస్వతీ మాతాజీ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు., ధ్వజస్తంభం ఊర్ధ్వముఖంగా నిలకడగా ఉంటుందని, అలాగే మన మనస్సు కూడా నిలకడగా ఉండాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు



ఇమ్రాన్ వలి

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలీస్ కానిస్టేబుల్ ఇమ్రాన్ అలీ తీవ్రంగా గాయపడ్డారు. రెస్టు ట్రాఫిక్ సీఐ సింగయ్య కథనం మేరకు నల్లచెరువుకు చెందిన ఇమ్రాన్ వలి ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్‌కు డ్రైవర్‌గా ఉన్నారు. బుధవారం మధ్యాహ్నం డీఎస్పీని ఇంటి దగ్గర నుంచి ఇమ్రాన్ వలి భోజనం చేసేందుకు తన ద్విచక్రవాహనంపై నల్లచెరువుకు వస్తుండగా కోబాల్డ్ పేట మెయిన్ రోడ్ లోని మసీదు వద్ద ఎదురుగా రాంగ్ రూట్‌లో వస్తున్న, మద్యం తాగి ఉన్న ఇద్దరు యువకులు ఇమ్రాన్ ఎ వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇమ్రాన్ తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం లలిత ఆస్పత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన యువకులు బీటెక్ విద్యార్థులుగా గుర్తించారు. ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

మేయర్.. బహిరంగ చర్చకు సిద్ధమా ?: ఎమ్మెల్యే నసీర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు నసీర్, మాధవి

గుంటూరు,ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నగరంలో అభివృద్ధి పనులపై అంబటి రాంబాబు, మేయర్ కావటి మనోహర్ నాయుడు బహిరంగ చర్చకు సిద్ధం కావాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ సవాల్ విసిరారు. గుంటూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. నసీర్ మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ ఎన్నికలపై అంబటి రాంబాబు వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. వైసీపీ నేతలు క్యాంపులు పెట్టి దాచి పెట్టిన అభ్యర్థులే కూటమికి మద్దతు తెలిపిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇప్పటికైనా కావటి మేయర్ పదవికి రాజీనామా చేసి ప్రజాభిప్రాయం కోరాలని డిమాండ్ చేశారు. గుంటూరుతోపాటు అమరావతి రాజధాని అభివృద్ధిపై దమ్ముంటే అంబటి, కావటి బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

‘స్టాండింగ్ కమిటీ ఫలితాలతో వైసీపీకి దిమ్మ తిరిగింది’

గుంటూరు నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు చూసి వైసీపీ నేతలకు దిమ్మ తిరిగి మీడియా ముం దుకు వచ్చి తమ ఆక్రోశాన్ని వెళ్లగక్కుతున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. అభివృద్ధికి మద్దతుగా ఓటు వేసిన వైసీపీ కార్పొ రేటర్లను బెదిరించే విధంగా వ్యాఖ్యలు చేయడం వారి చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు రాజీనామా చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

ఇంటర్ ఒకేషనల్ ప్రయోగ పరీక్షలు ప్రారంభం

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఒకేషనల్(వృత్తి విద్యా కోర్సులు) విద్యార్థులకు బుధవారం నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షలకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు 1215 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 867 మంది హాజరయ్యారు. ఇందుకోసం జిల్లాలో మొత్తం 15 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఐఓ జీకే జుబేర్ వెల్లడించారు. ప్రయోగ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించినట్లు వివరించారు. ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఈ నెల 20 వరకు మూడు విడతల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా, ఈ నెల 10 నుంచి జనరల్ విద్యార్థులకు (ఎంపీసీ, బైపీసీ) ప్రయోగ పరీక్షల ప్రారంభం కానున్నాయి.



మిర్చియార్డులో ట్రేడర్లు, అధికారులతో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక

మిర్చి లారీలను అడ్డుకుంటే కఠిన చర్యలు

● సెక్రెటరీ, పోలీసుల హెచ్చరిక

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మిర్చి ఎగుమతిదారులు వారికి ఇష్టమైన లారీలను లోడింగ్‌కి పెట్టుకోవచ్చని, తమ లారీలనే పెట్టుకోవాలని వేరే ఎవరైనా అంటే వాళ్లని అడ్డుకుంటామని, చూస్తూ ఊరుకోబోమని వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక, పోలీసు అధికారులు హెచ్చరించారు. మిర్చి యార్డు పరిపాలన భవనంలో ట్రేడర్లు, లారీ యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొంతమంది ట్రేడర్లు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాతో పోల్చితే ఇక్కడ లారీ యజమానులు బంగ్లాదేశ్ బోర్డర్‌కు లారీ కిరాయికి పెడితే దాదాపు రూ.15 వేల నుంచి రూ. 20 వేల వరకు అదనంగా డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. హమాలీ ఛార్జీలు కూడా ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. దీని వలన మిర్చి కేజీకి రూ. 2 వరకు ధర తక్కువగా ఖమ్మం యార్డులో లభిస్తుండటంతో వ్యాపారులంతా అక్కడికి వెళ్లిపోతున్నారని అన్నారు. బంగ్లాదేశ్ ఆర్డర్లలో 60 శాతం కోల్పోయినట్లు చెప్పారు. లారీ ఓనర్లు మాట్లాడుతూ గత ఏడాది రూ. 1.70 లక్షలు చెల్లించారని, ఇప్పుడు తామే అదే ఇవ్వమని కోరుతున్నామన్నారు. అందుకు ట్రేడర్లు అంగీకరించకుండా రూ. 1.50 లక్షలకు మించి ఇచ్చేది లేదని వారు అంటున్నట్లు చెప్పారు. ఈ విధంగా ఇరువర్గాల భేదాభిప్రాయాలు వ్యక్తం చేయడంతో సమస్యని జేసీకి నివేదిస్తామని చంద్రిక తెలిపారు. దీనిపై ప్రభుత్వ వైఖరిని వివరిస్తూ ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడి నుంచి వ్యాపారం తరలిపోవడానికి వీల్లేదన్నారు. ఈ నేపథ్యంలో ఎవరైనా లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు ఎక్స్‌పోర్టర్లను ఇబ్బంది పెట్టాలని చూస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. బైండోవర్ కేసులు పెడతామన్నారు. సమావేశంలో నల్లపాడు సీఐ వంశీధర్, డీటీసీ సీతారామారావు, మిర్చి ట్రేడర్లు కొత్తూరి సుధాకర్, కర్లపూడి వెంకటేశ్వరరావు, నరేంద్ర, ఎస్ రమేష్, సెక్రెటరీలు సుబ్రహ్మణ్యం, అంజనేయ సింగ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అనధికార వ్యర్థాల సేకరణ నిలిపివేయాలి

● జీఎంసీ కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో కమర్షియల్ సంస్థలు, చికెన్ స్టాల్స్ నుంచి అనధికారిక వ్యర్థాల సేకరణ తక్షణం నిలిపివేయాలని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ చేపట్టనున్న పలు చర్యలపై బుధవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కమర్షియల్ సంస్థల నుంచి వ్యర్థాలసేకరణకు గతంలో రెండు సంస్థలకు ఇచ్చిన కాంట్రాక్ట్ గడువు ముగిసిందని చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత నూతన టెండర్ పిలుస్తామని తెలిపారు. జీఎంసీ అనుమతి లేకుండా కొంత మంది అనధికారికంగా ఆయా సంస్థల నుంచి వ్యర్థాలు సేకరించి, అధిక మొత్తంలో నగదు వసూళ్లు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. ఈ వసూళ్లు నిలిపివేయకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వచ్చే శనివారం నాటికి నూరు శాతం ట్రేడ్ లైసెన్స్‌లు విధించడం, పాతవాటిని రెన్యువల్, ఫీజుల వసూళ్ల ఆదేశించామన్నారు.

నూతన రోడ్లు డ్రైన్ టూ డ్రైన్ ఉండేలా చర్యలు

నగరంలో అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టే నూతన రోడ్లు డ్రైన్ టు డ్రైన్ ఉండేలా చర్యలు తీసకోవాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక ఏటీ అగ్రహారం, హౌసింగ్ బోర్డు కాలనీ, ఇస్కాన్ గుడి రోడ్డు, పట్టాభిపురం, గోరంట్ల, ఇజ్రాయిల్ పేట, సుద్దపల్లి డొంక తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఆయా చోట్ల అభివృద్ధి పనులు, పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. చేపట్టాల్సిన చర్యలపై ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు టెండర్ ద్వారా వర్క్ ఆర్డర్ పొందిన కాంట్రా క్టర్లు ఆయా పనులను వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. కాంట్రాక్టర్లు క్షేత్ర స్థాయిలో తమ సమస్యలపై కమిషనర్‌ని చాంబర్‌లో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ పనులు, పెండింగ్ పనులను కాంట్రాక్టర్లు వెంటనే చేపట్టాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్రతి పని నేరుగా తనిఖీ చేసిన అనంతరమే బిల్లుల చెల్లింపు చేస్తామన్నారు. కాంట్రాక్టర్లు క్షేత్ర స్థాయిలో తాము ఎదుర్కొనే సమస్యలను తమ దృష్టికి తీసుకురావచ్చని, వచ్చే శుక్రవారం కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండా రమేష్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ బిగ్ కెపాసిటిని జీఎంసీ అభివృద్ధి పనుల కాంట్రాక్టులు పొందేందుకు అమలు చేయాలని కోరారు. లేకుంటే ఒకే కాంట్రాక్టర్ పేరుపై తన పరిధికి మించి 20 నుంచి 30 వర్క్ లు ఉంటున్నాయన్నారు. ఇప్పటి వరకు చేసిన వర్క్‌లకు పేమెంట్ షెడ్యూల్ ఇవ్వాలని కోరారు.



కలెక్టర్ నాగలక్ష్మికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు

కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియ

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా- గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్ట భద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల ప్రకియ కొన సాగుతోంది. స్వతంత్ర అభ్య ర్థులుగా పోటీ చేస్తున్న పాపురి వెంకట అశోక్, ఎంరెడ్డి శివా రెడ్డి, గుడిసె రాంబాబు బుధవారం నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను కలెక్టరేట్‌లో కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎస్ నాగలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌వో ఎన్‌ఎస్‌కే ఖాజావలి పాల్గొన్నారు.

పట్టభద్రుల గళాన్ని వినిపించే సత్తా ఆలపాటిది

- కూటమి విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే మాధవి
- అనుభవజ్ఞులు ఆలపాటిని గెలిపించుకోవాలి: తేజస్విని
- గెలిపించేందుకు పట్టభద్రులు సిద్ధం: రాజేంద్రప్రసాద్





మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి, ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేంద్ర ప్రసాద్, సమావేశంలో పాల్గొన్న మన్నవ మోహనకృష్ణ, తేజస్విని

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో పట్టభద్రుల గళాన్ని బలంగా వినిపించే సత్తా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. ఉమ్మడి కృష్ణ-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ఆమె ఆధ్వర్యంలో ఎన్డీయే కూటమి విస్తృత స్థాయి సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి ఇస్తామని, 30 వేలకు పైగా ఓటర్లు తమ నియోజక వర్గంలో నమోదయ్యారని, మెజారిటీ కూడా అదే స్థాయిలో ఉండబోతోందని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకురాలు పొడపాటి తేజస్వి మాట్లాడుతూ మాధవికి 50 వేలకు పైగా మెజారిటి వచ్చేలాగా పనిచేసిన కార్యకర్తలు ఇప్పుడు కూడా అదే స్థాయిలో పని చేయాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అత్యధిక పట్టభద్రులు ఓటర్లుగా చేరారని, దాదాపు 40 శాతం మహిళా ఓటర్లుగా ఉన్నట్లు చెప్పారు. సాధారణ ఎన్నికల్లో ఇచ్చిన తీర్పు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ఇవ్వాలని కోరారు. ఈ 22 రోజులలో ప్రతి ఒక్క ఓటర్‌ను వ్యక్తిగతంగా కలిసి మొదటి ప్రాధాన్యతా ఓటు మాత్రమే వేయించాలని కోరారు. అనంతరం టీడీపీ జోన్- 5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ, సింహాద్రి కనకాచారి, మాను కొండ శివప్రసాద్, కనపర్తి శ్రీనివాసరావు, జనసేన నేతలు గాదె వెంకటేశ్వరావు, బోనబోయిన శ్రీనివాసరావు, ఆళ్ళ హరి, అంబేడ్కర్ మాట్లాడారు.



మాట్లాడుతున్న తెనాలి శ్రావణ్‌కుమార్, సమావేశంలో పాల్గొన్న రాజేంద్రప్రసాద్, టీడీపీ నాయకులు

ఎన్నికలు పూర్తయ్యే వరకూ అప్రమత్తంగా ఉండాలి: తెనాలి శ్రావణ్‌కుమార్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ ఎక్కువ లేదని ఉదాసీనంగా వ్యవహరించవద్దని, ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. ఆలపాటి గెలుపును కాంక్షిస్తూ టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన అధ్యక్షతన బుధవారం తాడి కొండ నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు దూండి రాకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతీ 30 ఓట్లకు ఒకరిని నియ మిస్తామన్నారు. ఇంటింటికి తిరిగి ప్రతీ ఓటరుని కలిసి కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను తెలియజేస్తామన్నారు. ఆలపాటి గెలుపునకు తాడికొండ నియోజకవర్గ కూటమి నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, దూండి రాకేష్ మాట్లాడారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి సారించాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్ బాషా అన్నారు. స్థానిక మెడికల్ కళాశాల ఆవరణలో ప్రభుత్వ జిల్లా ఉద్యోగుల సంఘ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు కనీసం ఒక్క కరువు భత్యం కూడా విడుదల చేయలేదని, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలపై షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, మధ్యంతర భృతిపై ప్రకటన చేయాలని కోరారు.

8న ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విద్యాసదస్సు


గుంటూరు (విద్య) ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యమ రథసారథి నూతలపాటి పరమేశ్వరరావు తృతీయ వర్ధంతి సందర్భంగా ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో 8న జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు కే బసవలింగారావు, ఎండి ఖలీద్ తెలిపారు. పొన్నూరులోని మొవ్వా గార్డెన్స్ లో జిల్లా స్థాయి విద్యాసదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో విద్యా సదస్సు కరపత్రాలు ఆవిష్కరించారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిలా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా ఉపాధ్యక్షులు పి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.




నగరవనంలో.. శిల్ప సోయగం

గుంటూరు సమీపంలోని పేరేచర్లలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నగరవనం పర్యాటకులకు ఆహ్లాదం పంచుతోంది. గత ప్రభుత్వంలో నిరాదరణకు గురైన ఈ వనం ప్రస్తుతం జంతు శిల్పాలతో అడవిలోనే ఉన్నామా అనే విధంగా పర్యాటకులకు కనువిందు చేస్తోంది. నగరవనంలోకి అడుగు పెడితే పులులు..ఏనుగులు..కొండచిలువ.. తోడేళ్ళు.. జింకలు.. బల్లులు కనిపిస్తాయి.మొదటిసారి వాటిని చూస్తే అవి నిజంగా ఉన్నాయేమో అనిపిస్తుంది. కానీ అవి శిలలపై చెక్కిన శిల్పాలు. బొమ్మలే కానీ కళాచాతుర్యంతో జీవం పోశారు. ఆహ్లాదం కోసం అక్కడకు వెళ్లే అనేకమందికి ప్రస్తుతం అవే కనువిందు చేస్తున్నాయి.అటవీశాఖ అధికారుల ఆలోచనకు అందరి ప్రశంసలు వస్తున్నాయి.

-గుంటూరు, ఆంధ్రజ్యోతి





వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన తమిళనాడు బృందం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్ర వ్యవసాయ ఉన్నతాధికారి బాల సౌందరి టీం లీడర్‌గా ఉన్న నలుగురు సభ్యుల బృందం జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి వచ్చిన ఈ ఉన్నధికారుల బృందం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. మంగళగిరిలోని సమీకృత వ్యవసాయ



లాంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న తమిళనాడు ఉన్నతాధికారుల బృందం

పరీక్ష కేంద్రంతో పాటు, పొన్నూరు, తాడికొండ, వట్టిచెరుకూరు మండలాల్లోని గ్రామాల్లో పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం పథకాలైన పొలంపిలుస్తోంది, ప్రకృతి వ్యవసాయం, ఈ క్రాప్‌లో పంటల నమోదు, కౌలు రైతులకు రుణ విధానం, వడ్డీ లేని రుణాలు తదితర వాటి మార్గదర్శకాలు, నియమ నిబంధనలు అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ సాగు విధానంలోని ఆదాయ, వ్యయాల వివరాలను సేకరించారు. బీజా మృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతముల తయారీ విధానంను వారికి ప్రకృతి వ్యవసాయ టీం చూపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిషనరేట్ కార్యాలయం నుంచి డీడీ వెంకటేశ్వరరావు, ఏడీ ఆచారి, జిల్లా ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రులను ప్రభావితం చేస్తే చర్యలు

◆ ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమాల నిర్వహణ ◆ కృష్ణా - గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికల ఆర్‌వో నాగలక్ష్మి

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 'పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నది. ఎవరూ పట్టభద్రులైన ఓటర్లను ప్రభావితం చేసే చర్యలు చేపట్టొద్దు. అలా చేస్తే వారిపై ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద కఠిన చర్యలు చేపడతాం..' అని గుంటూరు-కృష్ణా జిల్లాల నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై ఆమె ఏఆర్‌వో షేక్ ఖాజా వలితో కలిసి కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఓటర్లు పట్టణ ప్రాంతాల్లో అధికంగా ఉన్నారని, ఒక్కో పట్టణంలో నాలుగు నుంచి ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి ఎలక్షన్ కోడ్ అమలుని పర్యవేక్షిస్తున్నామన్నారు. సభలు, సమావేశాలు ఇతర ప్రచార కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరన్నారు. ఇందుకోసం ఏఆర్‌వో కార్యాలయాల్లో సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇస్తామన్నారు. ఎమ్మెల్సీ ఓటు వేయడంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు ఏ అభ్యర్థికి అయినా 50 శాతం ప్రాధాన్య ఓట్లు వచ్చేంత వరకు కొనసాగుతుందన్నారు. తొలి ప్రాధాన్య ఓట్లలో ఎవరికి 50 శాతం ఓట్లు దాటకపోతే అతి తక్కువ సంఖ్యలో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వో నాగలక్ష్మి, పక్కన ఏఆర్‌వో ఖాజావలి

ఓట్లు వచ్చిన అభ్యర్థికి వచ్చిన ఓట్లను షేరింగ్ చేస్తూ ఎలిమినేట్ చేసుకుంటూ పోతామన్నారు.

ఎమ్మెల్సీ ఓటు వేయడం ఎలా..

- ఓటు వేసే సమయంలో పీవో వంకాయ రంగు స్కెచ్ పెన్నుని బ్యాలెట్ పేపర్‌తో సరఫరా చేస్తారు. దానిని వినియోగించే ఓటరుకు ప్రాధాన్యాలను ఇవ్వాల్సి ఉంటుంది. మరే ఇతర పెన్ను, పెన్సిల్ వినియోగించరాదు.
- ఎంతమంది అభ్యర్థులకు అయినా ఓటు వేయొచ్చు. అయితే ఒక అభ్యర్థికి ఒక ప్రాధాన్య ఓటు మాత్రమే అంకెల ద్వారా ఇవ్వాలి. ఒక అభ్యర్థికే ఓటు వేయదలిస్తే 1 మాత్రమే నమోదు చేయాలి. ఉదాహరణకు నలుగురు అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వదలిస్తే 1, 2, 3, 4 అని నెంబర్లు ఇవ్వాలి. 1 ప్రాధాన్య ఓటు వేసి 2వ ప్రాధాన్యం ఇవ్వకుండా 3, 4 ఇస్తే ఆ ఓటు చెల్లదు. అభ్యర్థి పేరకు ఎదురుగా ఒక అంకె మాత్రమే వేయాలి.
- రోమన్ అంకెలలో అయినా ప్రాధాన్య ఓటుని పేర్కొనవచ్చు.
- అంకెకి సున్నా చుట్టడం, పక్కన చుక్క పెట్టడం, బ్రాకెట్ పెట్టడం వంటివి చేయరాదు.
- బ్యాలెట్ పేపర్‌పై ఎలాంటి సంతకం, వేలిముద్ర వేయరాదు.

పోలింగ్ స్టేషన్ల సంఖ్య

జిల్లా	ప్రతిపాదిత స్టేషన్లు	అనుబంధ స్టేషన్లు	మొత్తం
గుంటూరు	118	31	149
పల్నాడు	73	17	90
బాపట్ల	28	6	34
ఏలూరు	20	1	21
ఎన్‌టీఆర్	101	11	112
కృష్ణా	76	1	77

ఓటర్ల సంఖ్య ఇలా...

జిల్లా	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
గుంటూరు	62277	45318	18	107613
బాపట్ల	15292	9150	5	24447
పల్నాడు	37381	19129	4	56964
ఏలూరు	9858	6218	1	16077
కృష్ణా	35378	27807	5	63190
ఎన్‌టీఆర్	45540	32685	13	78238

కుంభమేళాకు ఆర్టీసీ స్పెషల్ బస్సు

● టిక్కెట్ ధర రూ. 8,300

గుంటూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు నుంచి మహా కుంభమేళాలో పుణ్య స్నానాల కోసం (ప్రయాగరాజ్)కు వెళ్ళే వారి కోసం ఆర్టీసీ గుంటూరు-2 డిపో అధికారులు స్పెషల్ హైటెక్ (2+2) పుష్ బ్యాక్ సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం కల్పించారు. మొత్తం 8 రోజుల యాత్రతో ప్రత్యేక సర్వీసును ఏర్పాటు చేసినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 11న గుంటూరు బస్టాండ్‌లో ఉదయం 10 గంటలకు బస్సు బయల్దేరుతుందన్నారు. మొత్తం 8 రోజుల్లో తొలి రోజు గుంటూరు నుంచి బయల్దేరి రెండో రోజు సాయంత్రానికి కుంభమేళా ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటుందన్నారు. మూడో రోజు మొత్తం ప్రయాగరాజ్‌లో బస చేసి పుణ్య స్నానాలు ఆచరించి, 4వ రోజు రాత్రికి అయోధ్య చేరేందుకు బయల్దేరుతుం దన్నారు. 5వ రోజు ఉదయం అయోధ్య చేరుకొని, బాలరాముని దర్శించుకొని, సాయంత్రానికి వారణాసి బయల్దేరుతుందని ఆరో రోజు ఉదయం వారణాసి చేరుకొని, ఆ రోజు వారణాసిలో బస చేసి ఏడో రోజు ఉదయం వారణాసి నుండి బయలు దేరి ఎనిమి దివ రోజు రాత్రికి గుంటూరు చేరుకుంటుం దన్నారు. ఈ సర్వీస్ కు 91927 ఆన్‌లైన్ సర్వీస్ నంబర్ ద్వారా రిజర్వేషన్ చేసుకొనే అవకాశం కూడా ఉందని డీఎం తెలిపారు. 10 కిలోమీటర్లు లోపు 35 మంది ప్రయాణికులు ఒకే చోటు నుండి బయల్దేరితే బస్సు అక్కడికి పంపటం జరుగుతుందన్నారు. ఒక్కో టికెట్ ధర రూ. 8300 మాత్రమే నని, ఇతర ఖర్చులు, భోజనం, వసతి ఖర్చులు ఎవరి ఖర్చులు వారే భరించాల్సి ఉంటుందన్నారు. వివరములకు 7382897459, 7382896403, 7382894613 సంప్రదించాలన్నారు.



సేద్యానికి.. డ్రోన్లు

5వ పేజీ తరువాయి)

ఉపయోగకరమని ప్రభుత్వం భావిస్తోంది. రోజుకు దాదాపు పదిహేను ఎకరాల్లో డ్రోన్ల సాయంతో సస్యరక్షణ చేపట్టే అవకాశం ఉంది. డ్రోన్ల సేవలను గరిష్ఠంగా ఉపయోగించుకుంటే సమయం ఆదాతో పాటు కూలి ఖర్చులు రైతులకు మిగులుతాయి.

ఇది తొలి అడుగుగానే...

సేద్యమే ప్రధాన రంగంగా ఆధారపడిన ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలుత మండలానికి ఓ యూనిట్‌గా డ్రోన్ల వినియోగం అనేది తొలి అడుగుగానే వ్యవసాయశాఖ చెబుతోంది. బాపట్ల జిల్లాలో ఇప్పటికే 35 యూనిట్లకు సంబంధించి గ్రూపుల ఎంపిక పూర్తయింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా మండలానికి ఓ గ్రామాన్ని యూనిట్‌గా ఎంపిక చేసి గ్రూపుల ఎంపికను కూడా ఓ కొలిక్కి తెచ్చారు. గ్రూపు సభ్యుల చేత బ్యాంకు ఖాతాలు తెరిచే ప్రక్రియ కూడా పూర్తి చేశారు.

దశలవారీగా సాంకేతికత..

దశల వారీగా వ్యవసాయంలో టెక్నాలజీని ప్రవేశపెట్టి సాగుకు సాంకేతిక హంగులు అద్దే కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని ప్రభుత్వం చెబుతోంది. ముఖ్యంగా ప్రకృతి విపత్తులకు సంబంధించి కచ్చితమైన సమాచారాన్ని నేరుగా రైతు చెంతకే చేరేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ చెబుతోంది. పిడుగుపాటుకు గురై మరణించే వారిలో అత్యధికులు రైతులే. ముందస్తు సమాచారంతో అప్రమత్తం ఒక్క సాంకేతికతతోనే సాధ్యమవుతుందని ఆ దిశగానే రాబోయే రోజుల్లో చర్యలు ఉండనున్నాయని ప్రభుత్వం అంటోంది.

రైతులకు సాయం.. ఉపాధి

డ్రోన్లను ఆపరేట్ చేసే వ్యక్తికి ఇంటర్మీడియట్ కనీస విద్యార్హత ఉండాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. పైలెట్‌కు సపోర్టింగ్ స్టాఫ్ కూడా కావాల్సి ఉంటుంది. వీరికి నెలవారీ ఇచ్చే జీతాన్ని డ్రోన్లకు వచ్చే నామమాత్రపు అద్దెతో పాటు ప్రభుత్వం కూడా కొంత భరించనుంది. దశల వారీగా డ్రోన్లను పెద్దఎత్తున ప్రవేశపెట్టాలనే తలంపుతో ప్రభుత్వం ఉండడంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు ఐదు వేల మందికి వీటి నిర్వహణ నిమిత్తం ఉపాధి దొరకనుంది. సాంకేతికత విధానం రైతులకు పూర్తి స్థాయిలో అవగతమయ్యే వరకు వీరి అవసరం ప్రతి దశలో ఉండనుంది. దీంతో అటు రైతులకు సేద్యం లాభసాటిగా మారడంతో పాటు ఇటు గ్రామాల్లో నిరుద్యోగ సమస్యకు కొంతమేర పరిష్కారం చూపేలా ప్రభుత్వం అడుగులేస్తోంది. గ్రూపులో సభ్యులుగా ఉండే రైతులు కాకుండా మరో ఐదుగురితో కమిటీ ఏర్పాటు చేస్తారు. వీరిలో ఒకరు డ్రోన్ పైలెట్‌గా ఉండగా అతనే కన్వీనర్‌గా కూడా ఉండనున్నారు. ఇంకొకరు కో కన్వీనర్‌గా, మరో ఇద్దరు సభ్యులుగా కమిటీలో వ్యవహరిం చనున్నారు. పైలెట్‌గా విధులు నిర్వహించే వ్యక్తికి ఇంటర్మీడియట్ చదువును తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రస్తుతం ఈ పైలెట్ లకు శిక్షణ ఇచ్చే కార్య క్రమంపై వ్యవసాయ శాఖ దృష్టి సారించింది.

నేటి నుంచి విజ్ఞాన్ మహోత్సవ్

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో నేటి నుంచి జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవ్ ప్రారంభం కానున్నట్లు వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ నాగభూషణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజ్ఞాన్ మహోత్సవ్ పోటీల విజేతలకు రూ.15 లక్షలకు పైగా బహుమతులను అందజేస్తామని తెలిపారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహోత్సవ్‌లో మొత్తం 80 ఈవెంట్లను నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా ఇండియన్ సింగర్, మ్యూజిక్ కంపోజర్ డాక్టర్ సాలూరి కోటేశ్వరరావు (కోటి), ఇండియన్ మ్యూజిక్ కంపోజర్ అండ్ ప్లేబాక్ సింగర్ ఎస్ఎస్ థమన్, గౌరవ అతిథిగా మాజీ ఇండియన్ వాలీబాల్ ప్లేయర్ మన్యం తులసి రెడ్డి హాజరవుతారని వెల్లడించారు. రెండో రోజు కార్యక్రమానికి ఇండియన్ యాక్టర్, డైరెక్టర్, స్క్రీన్ రైటర్, హీరో విశ్వక్ సేన్, హీరోయిన్ ఆకాంక్ష శర్మ, యాక్టర్ అభిమన్యు సింగ్ విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. చివరి రోజు జరిగే ముగింపు కార్యక్రమానికి ఇండియన్ ఫిల్మ్ డైరెక్టర్, స్క్రీన్ రైటర్ కేఎస్‌రవీంద్ర (బాబీ), 2024 పారా లింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్, ఇండియన్ పారా పిస్టల్ షూటర్, అర్జున అవార్డు గ్రహీత రుబినా ఫ్రాన్సిస్ రానున్నారని తెలియజేసారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూర పాటి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొంటారని వీసీ తెలిపారు.



విజ్ఞాన మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న విద్యార్థులు

ఆరు జిల్లాల్లో.. అనుమతులంటే ఎలా?

● సతమతమవుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులు

● ఏక గవాక్ష విధానంలో గుంటూరులోనే ఇవ్వాలని వినతి

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఇతర ప్రచార కార్యక్రమాలు చేసుకోవడానికి అభ్యర్థులకు పెద్ద చిక్కు వచ్చి పడింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాల విభజన జరిగిన కారణంగా ప్రస్తుతం ఈ నియోజకవర్గం ఆరు జిల్లాల పరిధిలో ఉన్నది. దీంతో ఆయా జిల్లాలకు వెళ్లి అనుమతులు తీసుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఎన్నికలకు మరో నెల సమయం కూడా లేకపోవడంతో తమ సమయం అంతా ఈ అనుమతులు తీసుకోవడానికే సరిపోతుందని ఇప్పటికే నామినేషన్ వేసిన అభ్యర్థులు, మరో రెండు, మూడు రోజుల్లో దాఖలు చేయబోతున్న క్యాండేట్లు వాపోతున్నారు. ఈ విషయంలో నిబంధనలను ఎన్నికల సంఘం సడలించాలని కోరుతున్నారు.

గతంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మాత్రమే ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఉండేది. దాంతో అప్పట్లో అనుమతులు రెండు చోట్ల తీసుకొంటే సరిపోయేవి. ఇప్పుడు అలా కాదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణ, ఎన్‌టీఆర్, ఏలూరు జిల్లాల అధికారుల అనుమతులు తీసుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. గత నెల చివరి వారంలోనే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఈసీ ఆదేశాల మేరకు ఆ రోజు నుంచి సాధారణ ఎన్నికల వలే ప్రవర్తన నియమావళిని అధికారులు పకడ్బందీగా అమలు చేస్తున్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడగడం, బహిరంగ ప్రదేశాల్లో ఫ్లెక్సీల తొలగింపు వంటివి పూర్తి చేశారు. బుధవారం సాయంత్రం వరకు నలుగురు నామినేషన్లు వేశారు. ఇంకా మరో ఐదు రోజుల సమయం ఉన్నందున ఆయా జిల్లాల నుంచి మరికొందరు నామినేషన్లు వేసే అవకాశం ఉన్నది.

కాగా ఆయా అభ్యర్థులు ఎన్నికల ప్రచార కార్యక్రమాల కోసం అనుమతులు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి అయిన గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. ప్రతీ జిల్లాలో ఏఆర్‌వో(డీఆర్‌వో/ఎస్‌డీసీ)ల వద్దకు వెళ్లి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారు. అక్కడ ఏకగవాక్ష విధానంలో అనుమతులు ఇస్తారని పేర్కొంటున్నారు. అయితే ఆరు జిల్లాల్లో తీసుకోవాలంటే చాలా కష్టమౌతుందని, దీనికే రెండు, మూడు రోజుల సమయం పడుతున్నందున నిబంధనలను సడలించాలని కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం ఎల్ రాజగోపాల్ అనే వ్యక్తి కలెక్టరేట్‌కు వచ్చి ఆర్‌వో నాగలక్ష్మికి ఫిర్యాదు అందజేశారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

8, 9 తేదీల్లో చార్వాకాశ్రమంలో నాస్తిక మేళా

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నిడమర్రు రోడ్డులోని చార్వాకాశ్రమంలో ఈ నెల 8, 9 తేదీల్లో 33వ జాతీయ నాస్తిక మేళా జరుగుతుందని నాస్తిక సమాజం ప్రతినిధులు స్టాలిన్, కే కోటేశ్వరరావు తెలిపారు. సమాజంలో దేవుడి చుట్టూ సాగుతున్న వ్యాపారాన్ని బహిర్గత పరిచి మూఢ విశ్వాసాల నుంచి ప్రజలను విముక్తులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. అసంఖ్యాక ప్రజలు మెరుగైన జీవితం గడపాలంటే శాస్త్ర సాంకేతిక హేతువాద భావజాలం ఎంతో అవసరమని, ఇందుకు ఒక సాంస్కృతిక విప్లవం రావాలని అభిప్రాయపడ్డారు. ఈ లక్ష్యంతో నిర్వహిస్తున్న నాస్తిక మేళాలో అభ్యుదయవాదులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నృసింహుడికి వెండి పళ్లెం సమర్పణ



ఈవో రామకోటిరెడ్డికి వెండి పళ్లెం అందజేస్తున్న దాత చంద్రశేఖర్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారికి శ్రీఆద్య బిల్డర్స్ అధినేత చిరుమామిళ్ల చంద్రశేఖర్ వెండి పళ్లెం కానుకగా సమర్పించారు. రూ.లక్షా 40 వేల విలువ చేసే కిలో 35 గ్రాముల వెండి, రెండు గ్రాముల బంగారు తాపడంతో తయారు చేయించిన ఈ పళ్లేన్ని బుధవారం దేవదాయశాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డికి అందజేశారు.

కొలనుకొండలో ప్యాసింజర్ రైళ్లు ఆపాలి

తాడేపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండ రైల్వే స్టేషన్‌లో కొలనుకొండ వడ్డేశ్వరం గ్రామస్థులు పలువురు మంగళవారం సాయంత్రం విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్‌ను కలిశారు. కొలనుకొండ రైల్వేస్టేషన్‌లో ప్యాసింజర్ రైళ్లు ఆపాలని విజ్ఞప్తి చేశారు. సదరు రైళ్లు ఆపడం వల్ల కొలనుకొండ, వడ్డేశ్వరం, ఇప్పటం బ్రహ్మానందపురం రాధారంగా నగర్, ఆత్మకూరు గ్రామస్థులకు, కేఎల్‌యూ ఏపీడీజీపీ సిబ్బంది, పలువురు ఉద్యోగులు విధుల నిర్వహణకు వచ్చేందుకు పాసింజర్ రైళ్లు ఉప కరించేవని, గతంలో ఆగేవని ప్రస్తుతం ఆగకపోవడం వల్ల వారందరూ ఇబ్బందులు పడుతున్నారని డీఆర్‌ఎంవోకు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ప్యాసింజర్ రైళ్లను కొలనుకొండలో ఆపాలని వినతిపత్రం అందించి విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శిఖా నాగేశ్వరరావు, పాలడుగు శ్రీనివాసరావు, రాహుల్, భాస్కర్‌బాబు, ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రక్షితనీటి ట్యాంకు నిర్మాణానికి స్థల పరిశీలన

దుగ్గిరాల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలో రూ.4కోట్లతో రక్షిత నీటి ట్యాంకు నిర్మాణానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కల్యాణ్ చక్రవర్తి బుధవారం సాయంత్రం స్థల పరిశీలన చేశారు. గ్రామంలోని చెన్నకేశవనగర్, రైలుపేట, బంగ్లా పరిసరాలతోపాటు గ్రామంలో నివసించే ప్రజలందరికీ, సురక్షిత మంచి నీటిని అందించేందుకు గానూ దుగ్గిరాలలోని బంగ్లా, కళాశాల పరిసరాలను పరిశీలించారు. 2లక్షల లీటర్ల సామర్థ్యం గల నీటిట్యాంకు నిర్మాణం కోసం గతంలోనే మట్టి నమూనాలను సేకరించిన విషయం విదితమే. త్వరలో నిర్మాణం పనులను ప్రారంభించనున్న నేపథ్యంలో మరో మారు స్థానిక అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు.

అనుమతి లేకుండా నీటిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

పెదనందిపాడు, ఫిబ్రవరి, 5 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పుసులూరులో గంధం శంబుడి చెరువులో అనుమతి లేకుండా ట్యాంకర్ల ద్వారా నీళ్లు తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శి ఎన్ కళ్యాణి బుధవారం పిర్యాదు చేశారు. గ్రామంలో ఆ చెరువు నుంచి ట్యాంకర్ ద్వారా గ్రామంలో ప్రజావసరాల నిమిత్తం నీటిని సరఫరా చేస్తున్నామని, ఈ నీటిని ఎవరూ ఇతర అవసరాలకు వినియోగించరాదంటూ గ్రామంలో టాంటాం ద్వారా తెలియపరిచామని, అయినప్పటికీ గ్రామానికి చెందిన వల్లంశెట్టి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు ఇద్దరు ట్రాక్టర్ల ద్వారా పొలానికి నీరు తరలిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో లక్ష్మీదేవి, తహసీల్దార్ శంకరబాబు, ఎస్ఐ మధుపవన్‌లకు కార్యదర్శి పిర్యాదు చేశారు.

టిడ్కో ఇళ్ల సముదాయాల్లో గంజాయి బ్యాచ్ హల్‌చల్

- గంజాయి మత్తులో ఒకరిపై మరొకరి దాడి
- కేసు రాజీ చేసుకున్న ఇరు కుటుంబాల పెద్దలు
- గంజాయి విక్రయించినా.. తాగినా కఠిన చర్యలు
- సీఐ గంగా వెంకటేశ్వర్లు హెచ్చరికలు



తుళ్లూరు గ్రామ శివారులో ఉన్న టిడ్కో ఇళ్లు

తుళ్లూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): దొండపాడు, తుళ్లూరు టిడ్కో ఇళ్ల సముదాయాల్లో గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేస్తుంది. యువకులు సాయంత్రం సమయంలో గంజాయి తాగి గొడవలు పడుతున్నారు. వారం క్రితం గంజాయి మత్తులో ఉన్న ఓ యువకుడు మరో యుకుడిని అగ్గి పెట్టె ఉందా.. అని అడిగాడు. లేదని సమాధానం చెప్పటంతో గొడవకు దిగాడు. అనంతరం ఇనుప రాడ్‌తో మత్తులో ఉన్న యువకుడి తలపై మోదటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రాణపాయం తప్పింది. బాధిత యువకుడు తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇరు కుటుంబాల పెద్దలు రంగంలోకి దిగి కేసు రాజీ చేసుకున్నారు.

రెండు నెలల క్రితం గంజాయి మత్తులో దొండపాడు టిడ్కో ఇళ్ల వద్ద వేళ కూలీ పనులు ముగించుకొని సాయంత్రం వేళ ఇంటికి వస్తున్న క్రమంలో ఓ మహిళను గంజాయి బ్యాచ్ చెరబట్టబోయినట్టు తెలిసింది. అరాచక శక్తులు అడ్డాగా టిడ్కో ఇళ్లు మారుతున్నాయని నివాసాలుంటున్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేదలకు ఇచ్చిన టిడ్కో ఇళ్లలో లబ్ధిదారులు ఉండ టం లేదు. రాజధాని నిర్మాణ పనులు నిలిపి వేయటంతో వైసీపీ ఐదేళ్ల పాలనలో కూలీలకు ఉపాధి లేకుండాపోయింది. దీంతో వారు పనుల కోసం బయట ప్రాంతానికి వలస వెళ్లారు. వారికిచ్చిన ఇళ్లు అద్దెలకు ఇచ్చుకున్నారు. అందులో కొన్ని అరాచక శక్తులుంటున్నాయని, గంజాయి తాగుతూ వచ్చి పోయే మహిళలతో అసభ్యంగా ప్రవరిస్తున్నారు. అంతేగాక యువకులు గంజాయి మత్తులో గ్రామాల్లో 80-90 కిలలోమీటర్ల స్పీడ్‌తో బైకులు నడుపుతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం : సీఐ

గంజాయి విక్రయించే వారిని, తాగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు అన్నారు. దీని కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. బైకులపై స్పీడ్‌తో వెళ్లే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

చలపతి ఫార్మసీలో ముగిసిన అనాకాన్ జాతీయ సదస్సు



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో డాక్టర్ శుబెండు పండిట్, నాదెండ్ల రామారావు

తాడికొండ(లాం), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఫార్మ ఎనలిటికా - ఎనలిటికల్ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అనాకాన్-2025 జాతీయ సదస్సు బుధవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ల్యాబ్ ఇండియా అనలిటికల్ ఇన్‌స్ట్రూమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎన్‌ఎంఆర్ ప్రోడక్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ శుబెండు పండిట్ పాల్గొన్నారు. జాతీయ సదస్సు సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఈ-పోస్టర్ విభాగంలో చలపతి థర్డ్ బీఫార్మసీ విద్యార్థిని ఏ అశ్వినీ ప్రథమ, ఎస్ చామంతి ద్వితీయ, మలినేని లక్ష్మయ్య ఫార్మసీ కళాశాల థర్డ్ బీఫార్మసీ కే మహేశ్వరి తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. క్విజ్ పోటీల్లో చలపతి కళాశాలలో నాలుగో సంవత్సరం బీఫార్మసీ గ్రూప్‌నకు మొదటి, మలినేని లక్ష్మయ్య ఫార్మసీ కళాశాల గ్రూప్‌నకు రెండో, చలపతి ఫస్ట్ ఎం ఫార్మసీ గ్రూప్‌నకు మూడో బహుమతి లభించింది. వ్యాసరచన పోటీల్లో చలపతి థర్డ్ ఫార్మాడీ విద్యార్థి వీ లక్ష్మీ సుమిత్రకు మొదటి, ఎం ఫార్మసీ విద్యార్థిని ఏ వేదశ్రీకి రెండో, కేసీ రెడ్డి ఫార్మసీ కళాశాల విద్యార్థిని బీ సోమాంజలికి మూడో బహుమతి లభించింది. ఐక్యూ టెస్టు పోటీల్లో చలపతి విద్యార్థులు వీఎస్ ఎస్ శర్వాణి, ఏ ఉమామహేశ్వరి, పీ శరణజ్యోతిలకు బహుమతులు లభించాయి. ఫొటోగ్రఫి పోటీల్లో మలినేని లక్ష్మయ్య కళాశాల విద్యార్థిని వాసంతి మొదటి, చలపతి విద్యార్థి బరకతుల్లా రెండో, ముఫ్సాసెరా మూడో బహుమతి కైవసం చేసుకున్నారు. గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాలల అధినేత వైవీ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడుగు వర్గాలను దగా చేసేలా కేంద్ర బడ్జెట్

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఐ, రైతు సంఘం నేతలు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బడుగు, బలహీన వర్గాలను దగా చేసేలా ఉందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రైతు, కార్మిక, చేతి వృత్తిదారులకు జరిగిన అన్యాయాలను నిరసిస్తూ మంగళగిరి పాత బస్టాండు సెంటర్లో బుధవారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు మాత్రమే అనుకూలంగా ఉందన్నారు. రైతులను, కార్మిక వర్గాన్ని, చేతి వృత్తిదారులను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసే విధంగా ఉన్న ఈ బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు, సీపీఐ, రైతుసంఘం నేతలు కంచర్ల కాశయ్య, చిన్ని సత్యనారాయణ, జాన్‌బాబు, నందం బ్రహ్మేశ్వరరావు, దుర్గారావు, సాంబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో బడ్జెట్ ప్రతుల దహనం

తాడేపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రవేశపెట్టి బడ్జెట్‌లో రైతు, కౌలు, వ్యవసాయ కార్మిక రంగాల ఊసే లేదని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు విమర్శించారు. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు వ్యతిరేకంగా బడ్జెట్ ప్రతులను దహనం చేసి రైతు, కౌలు రైతులు నిరసన తెలిపారు. కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పల్లె కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హరిబాబు, కాజ వెంకటేశ్వరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పల్లె కృష్ణ, అమ్మిశెట్టి రంగారావు తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లి కొలనుకొండ, ఉండవల్లి, కుంచనపల్లి గ్రామాల్లో నేతలు బడ్జెట్ ప్రతులను దహనం చేశారు.

దుగ్గిరాలలో ప్రజాసంఘాల నిరసన

దుగ్గిరాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రం వ్యవసాయ, కార్మిక రంగాలకు బడ్జెట్‌లో తీరని అన్యాయం చేసిందని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు అన్నారు. దుగ్గిరాలలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన చేశారు. కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, సీఐటీయూ నాయకులు మన్నవ నాగమల్లేశ్వరరావు, యోగేశ్వరరావు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడులో..

పెదనందిపాడు, ఫిబ్రవరి, 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెదనందిపాడులో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు, రైతు సంఘ జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివ, మండల అధ్యక్షుడు ముద్దన వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు పోపూరి సుధీర్, కన్నెగంటి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

64వ రోజుకు చేరుకున్న ఏసీసీ కార్మికుల దీక్షలు

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏసీసీ సిమెంటు కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు బుధవారంతో 64వ రోజుకు చేరుకున్నాయి. ఈ రిలే దీక్షలను సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, కూరపాటి స్టీవెన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏసీసీ కార్మికుల న్యాయమైన సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల ప్రచారంలో నారా లోకేశ్ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీక్షల్లో నవనీతం, రిబ్కా, కాశమ్మ, ధనమ్మ కూర్చున్నారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా ఆశీర్వాదం, సులేమన్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

అందరూ సానుకూలంగా ఆలోచించాలి : డీపీవో



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో నాగసాయికుమార్

ప్రత్తిపాడు (తుమ్మలపాలెం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎన్ని అదనపు బాధ్యతలు ఉన్నప్పటికి వాటిని చేస్తూనే మన విధులను మనం నిర్వర్తించవలసిందేనని జిల్లా పంచాయతీ అధికారి నాగసాయికుమార్ ఆదేశించారు. మండలపరిధిలోని తుమ్మలపాలెం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో జిల్లాలోని 20 మండలాలకు సంబంధించి ఈవోపీఆర్డీలు, పారిశుధ్య కార్మికులు, పంచాయతీ కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దుగ్గిరాల ఈవోపీఆర్డీ నెప్రూరా మాట్లాడుతూ ఎంపీడీవోలు తమపై అదనపు భారం పెడుతున్నారని, దీనివల్ల షెడ్‌ల నిర్వహణ వంటివి చూడానికి ఇబ్బందిగా ఉందని, ఆ భారం తగ్గించాలంటూ డీపీవోకు వివరించాడు. ఈవోపీఆర్డీలు అందరి తరపున తాను కోరుతున్నానన్నాడు. దీనిపై స్పందించిన డీపీవో ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి పనులు చేస్తూనే మన విధులు మనం నిర్వర్తించాలన్నారు. ప్రతి ఒక్కరూ సానుకూలంగా ఆలోచించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌సీ డీసీ పద్మరాణి శిక్షణను ఇచ్చారు. డంపింగ్ యార్డులో వర్మీ కంపోస్టుపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తెనాలి డీఎల్‌పీవో స్వరూపారాణి, ఈవోపీఆర్డీలు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

మంగళగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేకే మున్సిపల్ హైస్కూల్లో బుధవారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, మానసిక స్థితిగతులపై అవగాహన కల్పించారు. కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పోలు రవికుమార్ విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

150మందికి దంత వైద్య పరీక్షలు

పెదనందిపాడు, ఫిబ్రవరి, 5 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పాలపర్రులో సిబార్ దంత వైద్యశాల గుంటూరు వారి సహకారంతో బుధవారం దంత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు భార్గవి, రేణుక, శ్వేతశ్రీ, శ్రీలేఖలు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

నేతాజీ ఆశయాలు యువతకు ఆదర్శం

దుగ్గిరాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నేతాజీ ఆశయాలు యువతకు ఆదర్శమని కేఎల్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం అన్నారు. పెదపాలెం జడ్పీ హైస్కూల్లో పరాక్రమ్ దివస్ సందర్భంగా కేఎల్ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో నేతాజీ జీవిత చరిత్రపై క్విజ్ పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేతాజీ ఇండియన్ నేషనల్ ఆర్మీని స్థాపించి బ్రిటిష్ వారికి సవాల్ విసిరారని అన్నారు. బీసీఏ విభాగాధిపతి డాక్టర్ భగవాన్, డాక్టర్ కేఎస్ ప్రసాద్, డాక్టర్ భగవాన్, అధ్యాపకులు డాక్టర్ జీబీవీ కిషోర్, డాక్టర్ డీ. ఉషారాణి, కో-ఆర్డినేటర్ పి.సురేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కాకుమాను, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం జరిగింది. ఎస్ఐ పృథ్వీ ఏకనాథ్ తెలిపిన వివరాల ప్రకారం పెదనందిపాడు మండలం గోగులమూడి గ్రామానికి చెందిన చెన్నుపాటి విజయ వెంకట వరప్రసాద్ నాలుగేళ్లుగా దుబాయ్‌లో ఉంటూ టీచర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల దుబాయ్ నుంచి స్వగ్రామానికి చేరుకుని మంగళవారం మధ్యాహ్నం పుసులూరు కాకుమాను రహదారిలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుని భార్య వెంకట సునయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యవసాయ కూలీ మృతిపై కేసు

కాకుమాను, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీ మృతిపై కేసు నమోదైయినట్లు ఎస్ఐ పృథ్వీ ఏకనాథ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలపరిధిలోని అప్పాపురం గ్రామానికి చెందిన దారా వెంకటస్వామి(48) అలియాస్ జేమ్స్ వ్యవసాయ కూలీగా పనులు చేసుకుంటూ మంగళవారం మినుము పైరు తడపడానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు అతడిని వెతుకుతున్న తరుణంలో గట్టు మీద విగతజీవిగా పడిఉన్నాడు. అనారోగ్యంగా ఉండటంతో ఎండ వేడిమికి మృతి చెంది ఉంటాడని అనుకున్నారు. మృతుడి కుమారుడు డింకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలికతో అసభ్య ప్రవర్తనపై కేసు

మంగళగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామ పరిధిలో బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఈ నెల ఒకటో తేదీన సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళుతున్న క్రమంలో ఓ బాలికను సదరు వ్యక్తి అడ్డగించి అసభ్యకరంగా ప్రవర్తించాడని బాలిక తల్లిదండ్రులు పోలీసులకు పిర్యాదు చేశారు. దీంతో సీసీ కెమెరాల ద్వారా నిందితుడ్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ తెలిపారు. ఎర్రబాలెం గ్రామానికి చెందిన నిందితుడు మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రి ఆపరేషన్ థియేటర్‌లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడని వెల్లడించారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 1818 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1818 క్యూసెక్కుల సాగునీటిని బుధవారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.8 అడుగుల నీటి మట్టం ఉండగా, దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 46 క్యూసెక్కుల నీరు, రేపల్లె కాల్వకు 203 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 190 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 122 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 45 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 666 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

383 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 383 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,670 గరిష్ఠధర రూ.11,175 మోడల్‌ధర రూ.10,600 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.11,130, గరిష్ఠధర రూ.11,400 మోడల్‌ధర రూ.10,500 పలికాయి.

కళలతో ప్రజల్లో చైతన్యం నింపిన గరికపాటి

మంగళగిరి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కళారంగంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న గరికపాటి రాజారావు తన కళలు, గేయాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని ప్రజానాట్య మండలి జిల్లా నేత కంచర్ల కాశయ్య అన్నారు. ప్రజాకళాకారుడు డాక్టర్ గరికపాటి జయంతిని పురస్కరించుకుని మంగళగిరి సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘననివాళి అర్పించారు. ప్రజా కళారంగానికి గరికపాటి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ, ప్రజానాట్య మండలి నేతలు సందుపట్ల భూపతి, చిన్ని తిరుపతయ్య, నందం బ్రహ్మేశ్వరరావు, సత్యనారాయణ, జాన్‌బాబు, సాంబిరెడ్డి, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.



గరికపాటి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ నేతలు

వైభవంగా పెరుమాళ్ళు కల్యాణ మహోత్సవం

- చిన్నజీయర్ స్వామి మంగళశాసనాలు.. కన్నులపండువగా గిరి ప్రదక్షిణ



కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న చిన్నజీయర్ స్వామి

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో తాడేపల్లి పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో 8వ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో ఉన్న అన్ని ఆలయాలు పెరుమాళ్ళకు సామూహిక కల్యాణ మహోత్సవం నిర్వహించారు. పాల్గొన్న భక్తులందరికి అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం సాయంత్రం వేలాది మంది భక్తులచే గరుడవాహనంపై ఆ శ్రీనివాసుని గిరి ప్రదక్షిణ కార్యక్రమం చిన్న జీయర్ స్వామి పర్యవేక్షణలో అత్యంత వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వార్లను దర్శించుకోగా, స్వామీజీ వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. చిన్న జీయర్ ఆశ్రమ నిర్వాహకులు వెంకటాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంతరం స్వామి, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో సర్వైకల్ కేన్సర్ నివారణ

- డాక్టర్ వెల్లంకి శ్రీదేవి, షమా సుల్తానా



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శ్రీదేవి, పక్కన డాక్టర్ షమా సుల్తాన

గుంటూరు మెడికల్, తాడేపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా కేఎల్ యూనివర్సిటీలో బుధవారం గర్భాశయ ముఖ ద్వార కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విజయవాడకు చెందిన స్త్రీ, ప్రసూతి వైద్యనిపుణుల సంఘం (ఫాక్సీ) అధ్యక్షురాలు డాక్టర్ వెల్లంకి శ్రీదేవి సర్వైకల్ కేన్సర్‌పై, వాటి నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం హోప్‌విన్ హాస్పిటల్స్ ఛైర్ పర్సన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తాన మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార కేన్సర్‌కు ప్రధాన కారణం హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) అని, ఆడపిల్లలకు ఈ టీకా ఇవ్వడం ద్వారా సర్వైకల్ కేన్సర్ సోకకుండా నివారించవచ్చని తెలిపారు. హోప్‌విన్ హాస్పిటల్స్ వారి సంస్థ సలాం నమస్తే గుంటూరు సొసైటీ చేపట్టిన ప్రాజెక్ట్ సర్వే విజయవంతంగాపూర్తి చేసినందుకు డాక్టర్ షమా సుల్తానను అభినందించారు. కార్యక్రమంలో జేఎఫ్‌డీ రాజేందర్ రెడ్డి కందుల, జేఎఫ్‌ఎం ప్రదీప్ కొడాలి, జేఎఫ్‌ఎం ట్రెజరర్ డీవీ ప్రసాద్, ప్రాజెక్ట్ డైరెక్టర్ సుమ అట్లూరి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ షేక్ సుభాష్, వైస్ ప్రెసిడెంట్ గిరిధర్, లేడీ జేసీ రిప్రజెంటేటివ్ దీపిక కొడాలి పాల్గొన్నారు.

డయింగ్ కార్మికులకు త్వరలో మంచి రోజులు

- టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయరావు



సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయరావు

మంగళగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో డయింగ్ కార్మికులకు మంచి రోజులు రానున్నాయని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు చెప్పారు. చేనేత నూలు అద్దకం డయింగ్ వర్కర్స్ యూనియన్ 52వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం ఆత్మకూరు గ్రామంలో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. డయింగ్ కార్మికుల ఆదాయ మార్గాలను పెంపొందిం చేందుకు ప్రభుత్వం చేయూతనందిస్తుందని తెలిపారు. మంత్రి లోకేశ్ ఆలోచనలతో త్వరలో చేనేత పార్కు ఏర్పాటు కాబోతుందని, అందులో డయింగ్ వర్కర్స్‌కు కూడా ఉపాధి లభిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న చేనేత కార్మికులతోపాటు పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న అనుబంధ వృత్తిదారులకు కూడా న్యాయం చేయాలన్నదే మంత్రి లోకేశ్ ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో డయింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎంఎల్ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి కట్టా కృష్ణ, ఆత్మకూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు తాటి వెంకటరావు, నేతలు మల్లవరపు వెంకట్, మోతుకూరి రవి, కొమ్మా సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



దుగ్గిరాల శ్రీగంగాపార్వతీ సమేత శ్రీనాగేశ్వరస్వామివారి ఆలయ హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. ఈవో విఠల్ శ్రీనివాసవర్మ, ఇన్‌స్పెక్టర్ శారదల పర్యవేక్షణలో హుండీలోని కానుకలను లెక్కించారు. గడచిన 15 నెలలకు గానూ రూ.లక్ష 62వేల ఆదాయం లభించినట్లు తెలిపారు. అర్చకుడు యుగంధర్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు. (దుగ్గిరాల, ఆంధ్రజ్యోతి)

ఇసుక రీచ్‌లను మూసివేయాలి

● తహసీల్దార్ సిద్ధార్థ


పెదపర్తిపాలెం వద్ద ఇసుకరీచ్‌ని పరిశీలిస్తున్న అధికారులు

కొల్లిపర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన ఇసుక రీచ్‌లన్నీ గురువారం సాయంత్రం 6గంటలకు మూసివేయాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మున్నంగి, పిడపర్తిపాలెం, బొమ్మువానిపాలెం ఇసుకరీచ్‌లను ఎస్ఐ కోటేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. ఇసుక రీచ్ నిర్వాహకులను పిలిచి ప్రభుత్వం మీకు ఇచ్చిన సమయం గురువారం సాయంత్రం ఆరుగంటలకు ముగుస్తోందని ఆరు గంటల తర్వాత వాహనాల లోడింగ్ చేయడానికి అనుమతులు లేవన్నారు. డంపింగ్‌లో వాహనాలకు లోడింగ్ చేస్తున్న పొక్లెయిన్లు కూడా బయటకు తీసుకురావాలన్నారు. ఆరు గంటల తర్వాత ఇసురీచ్‌ల్లో యంత్రాలు, వాహనాలు ఉంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇసుకరీచ్ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని కోరారు.

వ్యవసాయరంగాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలి

● రైతుల సంక్షేమ సంస్థ ప్రతినిధి చిరాగ్


పసుపు పంటను పరిశీలిస్తున్న జాతీయ కోల్డ్ చైన్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రతినిధులు

కొల్లిపర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైతులు నూతన పరిజ్ఞానంతో వ్యవసాయరంగాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని జాతీయ కోల్డ్ చైన్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రతినిధి చిరాగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపరలో జాతీయ కోల్డ్ చైన్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు పర్యటించి పసుపు, అరటి, పలు రకాల పంటలను పరిశీలించారు. రైతులకు పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను జాతీయ కోల్డ్ చైన్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రతినిధులు పరిశీలించి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా చిరాగ్ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలన్నారు. జాతీయ కోల్డ్‌చైన్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రతినిధి ఆదిత్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌వో రవింద్రబాబు, ఏవో వెంకట్రావు, హెచ్ఈవో శ్రీధర్‌రెడ్డి, రైతులు నెర్ల కుటుంబరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉయ్యూరు సాంబిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధంకండి

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు


సమావేశంలో మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు, పాల్గొన్న టీడీపీ శ్రేణులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల సమయం దగ్గరపడుతుందని పట్టభద్రుల ఓటర్లకు పోలింగ్‌రోజున బ్యాలెట్ పేపర్‌పై అవగాహన పెంచి ఎన్నికలకు సిద్ధంచేయాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ నాయకులతో ఆనంద్‌బాబు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 7 కూటమి కృష్ణ, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రిఆలపాటి రాజేంద్రప్రసాద్ గుంటూరులో నామినేషన్ వేయనున్నారని ఆయనకు మద్ధతుగా తెనాలి, వేమూరు నియోజకవర్గాల నుంచి పెద్దసంఖ్యలో కూటమి శ్రేణులందరూ హాజరై మద్దతు తెలుపుదామన్నారు. అందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా రెండు నియోజకవర్గాల్లో ఆలపాటి అధిక మెజార్టీతో విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. పోలింగ్‌రోజున కేంద్రాల్లో బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటింగ్ జరుగుతుందని, పార్టీ గుర్తులుండవన్న విషయాన్ని పట్టభద్రులకు వివరించాలన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలందరూ ఏకతాటిపై నిలబడి ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తాచాటాలని ఆనంద్‌బాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర నాయకులు ఎస్‌కే కరిముల్లా, పట్టణ, మండల అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు, కొల్లిపర మండల అధ్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి, వంగ సాంబిరెడ్డి, పెండేల వెంకట్రావు, రావి చిన్ని, బోయపాటి అరుణ, దివి అనిత, అన్నం పిన్నారావు, కంచర్ల ఏడుకొండలు, మహమ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, అశోక వసంతం, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, ఈదర వెంకటపూర్ణచంద్, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

పార్కింగ్ కోసం స్థల పరిశీలన


పార్కింగ్ స్థలాన్ని పరిశీస్తున్న కమిషనర్ శేషన్న, డీఈ శ్రీనివాసరావు, ఆర్‌వో రామ్‌ప్రసాద్ తదితరులు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే మార్కెట్ సెంటర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు నడుం బిగించారు. అందులో భాగంగా వాహనాలను పార్కింగ్ చేసేందుకు అనువైన స్థలం పరిశీలన చేపట్టారు. స్థానిక మున్సిపల్ మహాత్మాగాంధీ కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ శేషన్న బుధవారం వివిధ శాఖల అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆక్రమణలను తొలగించి వాహనాలకు పార్కింగ్‌కు ఏరాటుచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శివన్నారాయణ, డీఈ శ్రీనివాసరావు, ఆర్‌వో రామ్‌ప్రసాద్, టీపీవో సాంబశివరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం రైతులకు బడ్జెట్ నిధులు పెంచాలి

● బడ్జెట్ ప్రతులను దహనం చేసి రైతుసంఘం నాయకుల నిరసన

తెనాలి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైతులు, కౌలు రైతులు వ్యవసాయ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని గుడివాడలో రైతుసంఘం సభ్యులతో కలిసి ములకా శివసాంబిరెడ్డి బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ నూటికి 70మందికి పైగా వ్యవసాయరంగంపై ఆధారపడి జీవిస్తున్నారని అటువంటి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయాల్సిన నరేంద్రమోడీ ప్రభుత్వం కేవలం 2.5మేర ఒక శాతం నిధులు కేటాయించడం రైతులను దెబ్బతీయడమేనని విమర్శించారు. అదేవిధంగా ఎరువులకు రూ.4352 కోట్ల సబ్సిడీలు తగ్గించడం వలన వాటి ధరలు పెరిగి రైతులు కౌలు రైతులకు వ్యవసాయం గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేకుండా పోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు మేలు జరిగేలా బడ్జెట్‌లో మార్పులు చేసి రైతులను ఆదుకోవాలని లేకుంటే నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకర్, కొలకలూరి జార్జి, కడియాల ప్రవీణ్, పి.సమాధానంరావు తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ఆధ్వర్యంలో ఐతానగర్‌లో బుధవారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సరోజిని, కోటేశ్వరరావు, సబిత, మరియదాసు, జార్జి, ప్రవీణ్, శకుంతల పాల్గొన్నారు.


బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న ములకా శివసాంబిరెడ్డి తదితరులు

9 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం


దంతలూరులో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

కొల్లిపర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దంతలూరులో గుర్తుతెలియని వ్యక్తులు 20మూటలు రేషన్ బియ్యాన్ని మరియమ్మ అనే మహిళ ఇంటి వెనుక డంపుచేసి వెళ్లారు. దీనిని గుర్తించిన మరియమ్మ బంధువులతో కలిసి బుధవారం తహసీల్దార్ సిద్ధార్థకు ఫిర్యాదుచేశారు. దీంతో రెవెన్యూ అధికారులు తహసీల్దార్ ఆదేశాల మేరకు వాటిని స్వాధీనం చేసుకుని కాటా వేయగా 9 క్వింటాళ్లు ఉన్నట్లు తెలియజేశారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

కొల్లిపర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లభాపురం సమీపంలో జూదరులపై దాడులు నిర్వహించి బుధవారం ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం వల్లభాపురం సమీపంలోని పంట పొలాల్లో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావటంతో వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.3వేల900లు, రెండు బైక్‌లను సీజ్‌చేసి కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

కార్పెంటర్‌పై వైసీపీ కౌన్సిలర్ దురాగతం

● అప్పు అడిగితే ఇవ్వలేదని కిడ్నాప్‌చేసి కుళ్లబొడిచారు
● అర్ధరాత్రి ఆసుపత్రిలో చేరిన కార్పెంటర్
● కిడ్నాప్ విషయం చెబితే కొడుకు, భార్యను చంపుతానని బెదిరింపు
● బాధితుడు షేక్ మస్తాన్‌వలి నుంచి వివరాలు సేకరించిన సీఐ


బాధితుడిని వివరాలడిగి తెలుసుకుంటున్న సీఐ రమేష్‌బాబు, గాయాలు పరిశీలిస్తున్న చిత్రం, ఇన్‌సెట్లో బాధితుడు మస్తాన్‌వలి

తెనాలి, ఫిబ్రవరి 5, (ఆంధ్రజ్యోతి): అప్పు అడిగితే ఇవ్వలేదని బలవంతంగా కారులో ఎక్కించుకుని కిడ్నాప్‌చేసి కారులోనే కుళ్లబొడిచి, విచక్షణారహితంగా కొట్టిపడేశారని, ప్రాణాలతో బయటపడి ఆసుపత్రికి చేరానంటూ ఓ కార్పెంటర్ కన్నీటి పర్యంతమయ్యాడు. గురువారం తెల్లవారు జామున త్రీటౌన్ సీఐ ఆసుపత్రికి వెళ్లి బాధితుని విచారించి వివరాలడిగి తెలుసుకున్నారు. బాధితుడు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. తెనాలికి చెందిన షేక్ మస్తాన్‌వలి తెనాలిలోనే కార్పెంటర్ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం వార్ఫ్ రోడ్‌లోని కోతమిషన్ దగ్గర ఉండగా నంబర్ ప్లేటు లేని తెల్లకారులో వైసీపీ కౌన్సిలర్ మొఘల్ అహ్మద్ బేగ్, మరో ముగ్గురు వచ్చి బలవంతంగా కారులో ఎక్కించుకుని తక్కెళ్లపాడు వరకు కొట్టుకుంటూ తీసుకువెళ్లి అక్కడ పెట్రోల్ బంక్‌లో కారుకు ఆయిల్ కొట్టించుకుని నా ఫోన్ ద్వారా రూ.5వేలు బలవంతంగా చెల్లించారని మస్తాన్‌వలి వివరించాడు. అక్కడి నుంచి పెదకాకాని దర్గాదగ్గరకు తీసుకువెళ్లి చివరిసారి దర్గాలోకి వెళ్లి నమాజు చేసి రావాలని, తర్వాత నువ్వు బతికుండవంటూ అక్కడి నుంచి విజయవాడ తీసుకువెళ్లి దారిపొడవునా కొట్టుకుంటూ తీసుకువెళ్లారని వివరించాడు. కర్రలు, రాడ్లు, చేతులతో విచక్షణా రహితంగా కొట్టారని, ముఖంపై రక్తం కారుతుంటే వాళ్ళే కడిగారని, నా చొక్కా ఉంటే రక్తం అంటుతుందని తీసేసి కొట్టారని, ఎవరో బాస్ చెన్నై నుంచి వస్తున్నారని, ఆయన వచ్చాక నిన్ను చంపుతామని ఇబ్రహీంపట్నం తీసుకువెళ్లి కొద్దిసేపు ఉంచి, అక్కడి నుంచి మళ్లీ తెనాలి తీసుకొచ్చి కౌన్సిలర్ ఇంటి ముందే వదిలేసి వెళ్లారని, ప్రాణాలతో బయటపడతానని అనుకోలేదని, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిపడ్డానని బోరున విలపించాడు. నన్ను కిడ్నాప్ చేసిన విషయం, కొట్టిన విషయం ఎవరికైనా చెబితే నా చిన్న కుమారుడిని, భార్యను చంపేస్తామని బెదిరించారని, గతంలో ఏ గొడవలూ లేని నన్ను డబ్బు ఇవ్వనందుకేనా! లేక వేరే ఇతర కారణాలు ఏమైనా పెట్టుకుని కిడ్నాప్ చేశారో తెలియటంలేదని కన్నీటి పర్యంతమయ్యాడు. కారులో ఉన్న నలుగురిలో కౌన్సిలర్ మినహా మిగిలిన ముగ్గురుని గతంలో చూడలేదని, వారు తమిళం, హిందీ మాట్లాడుతున్నారని వివరించాడు. అయితే గురువారం తెల్లవారుజామున 12.30 గంటల సమయంలో త్రీటౌన్ సీఐ విషయం తెలుసుకుని ఆసుపత్రికి వచ్చి బాధితుని నుంచి వివరాలు తీసుకున్నారు. అయితే కేసు మాత్రం ఇంకా నమోదు చేయలేదని, విచారించి నమోదు చేస్తామని పోలీసులు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని గెలిపించుకుందాం

● నాయకులకు మంత్రి మనోహర్ దిశానిర్దేశం


జనసేన నాయకులకు దిశా నిర్దేశం చేస్తున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు బలపరిచిన కూటమి కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని, అందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, వీర మహిళలతో మంత్రి మనోహహర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయని ప్రతి ఒక్కరూ ఆలపాటి గెలుపునకు తమ వంతు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ నెల 7న నామినేషన్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఆలపాటికి మద్ధతు తెలపాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రంలో జరిగే తొలి ఎన్నికలైన ఎమ్మెల్సీని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

వ్యర్థాలను పూర్తిగా తొలగించండి

● మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు


శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తదితరులు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): డ్రెయిన్లలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక కొత్తపేటలోని 7వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిప ల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు క్షేత్రస్థాయిలో అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకొనిపోవడం గమనించిన అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు శానిటరీ సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తంచేశారు. చెత్తను, వ్యర్థాలను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం 8వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

● పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మహిత


ర్యాలీ నిర్వహిస్తున్న పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మహిత, ఏఎన్ఎంలు లత, రాణి తదితరులు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 05 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మహిత అన్నారు. సుల్తానాబాదులోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కుష్టువ్యాధిపై ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని డాక్టర్ మహిత ఏఎన్ఎంలతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టువ్యాధి ప్రధానంగా చర్మానికి, నాడీ వ్యవస్థకు నష్టం కలిగిస్తుందన్నారు. రోగపీడితులు వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడాలన్నారు. అనంతరం వార్డులో కుష్టువ్యాధి నివారణపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు అరుణ, రాణి, లత, అనిత తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల చట్టాలు పునరుద్ధరించాలి

● సీఐటీయూ జిల్లా నాయకుడు బాబుప్రసాద్

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రద్దు చేసిన కార్మి చట్టాలను పునరుద్దరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు కె.బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. మార్కెట్‌లోని అన్నాబత్తుని పురవేదిక వద్ద బుధవారం ధర్నా చేశారు. కార్మికుల కోసం పార్లమెంట్‌లో 44 చట్టాలు చేశారని, వాటిని అమలు చేయడంవల్ల ఎంతో ఉపశమనం లభించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కరోనా కాలంలో 29 చట్టాలు ఏకపక్షంగా రద్దుచేసి వాటి స్థానంలో లేబర్ కోడ్‌లు ప్రవేశపెట్టిందన్నారు. కార్మికులు బానిసలుగా బతికే పరిస్థితులను తేవడానికి నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. హుస్సేన్‌వలి, వెంకటేశ్వర్లు, సుధాకర్, పద్మ, సుశీల, సుబ్బయ్య, శేషగిరిరావు పాల్గొన్నారు.

9న హనుమాన్ చాలీసా పారాయణ పోటీలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ రోడ్డులోని గోవర్ధన స్వామి ఆలయంలో ఈ నెల 9న హనుమాన్ చాలీసా పారాయణ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. జూనియర్ విభాగంలో 5-12, సీనియర్ విభాగంలో 13-20 సంవత్సరాల వయసు ఉన్న బాల బాలికలు పాల్గొనవచ్చని, ఒక్కో విభాగంలో ఐదుగురికి నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు. చాలీసాలోని 40 శ్లోకాలు చూడకుండా పాడాలని, ఆసక్తి కలిగిన గాయకులు 99890 35470లో పేర్లు నమోదు చేసుకోవాలని అంజనేయ శాస్త్రి, కొండపి శ్రీనివాసరావు తెలిపారు.


వెల్లలూరు రైతు సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తమిళనాడు వ్యవసాయ శాఖ అధికారులు

రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించిన తమిళనాడు అధికారులు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన అన్ని సేవలను రైతు సేవా కేంద్రాల ద్వారా స్థానికంగానే అందజేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ కమిషనరేట్ డీడీఏ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని వెల్లలూరు బ్రాహ్మణకోడూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది, రైతు సేవ కేంద్రాల సందర్శన కార్యక్రమాలు జరిగాయి. బ్రాహ్మణకోడూరులో పంట పొలాలను పరిశీలించారు. అనంతరం వెల్లలూరులో రైతు సేవ కేంద్రంను తమిళనాడు నుంచి వచ్చిన వ్యవసాయ శాఖ అధికారులు సందర్శించారు. రైతులకు అందజేస్తున్న సేవలు మట్టి నమూనాల సేకరణ, రాయితీపై విత్తనాల పంపిణీ, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం, పంట నమోదు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రైతుమిత్ర గ్రూపులు ఏర్పాటు వంటి పలు సేవలు గురించి తమిళనాడు అధికారులకు స్థానిక అధికారులు వివరించారు. అలాగే వ్యవసాయ శాఖ ఉపయోగిస్తున్న డి కృషి యాప్, ఈ పంట యాప్, హాజరు కోసం వినియోగిస్తున్న పీఎంఎ యాప్‌ల నిర్వహణ, ఉపయోగం గురించి అవగాహన కల్పించారు. వెల్లలూరు రైతులతో ఇష్టాగోష్టి నిర్వహించి తెల్లజొన్న పంటలో ఎరువుల యాజమాన్య పద్ధతులు నిర్వహణ వంటి సస్యరక్షణ చర్యలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనరేట్ ఏడీ బీఎస్ శ్రీనివాసాచార్యులు, స్థానిక ఏడీఏ వి.రామకోటేశ్వరి, ఏవో డేగల వెంకట్రామయ్య, తమిళనాడు వ్యవసాయశాఖ డీడీఏ డీఎస్ బాలసుందరి, ఏడీ తిరుమలకుమార్, అధికారులు ఆర్ రామని గోకుల్‌కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

టీచ టూల్‌తో సులభతర విద్యా బోధన: ఎంఈవో


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): టీచ్ టూల్ ఉపయోగించి సులభతరంగా విద్యాబోధన అందించవచ్చునని ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో బుధవారం టీచ్‌టూల్ వినియోగం గణిత కోర్సులకు సంబంధించి సమక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి కోర్సు స్టేట్ కోఆర్డినేటర్ వీరయ్య పరిశీలకులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యా బోధన విద్యార్థుల ప్రతిభ పరీక్షలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులను నిరంతరం పర్యవేక్షించి వారి విద్యా ప్రమాణాలను తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నులను సకాలంలో చెల్లించండి

● నోడల్ అధికారి డాక్టర్ హెలెన్ నిర్మల


పన్ను వసూలు చేస్తున్న నోడల్ అధికారి డాక్టర్ హెలెన్ నిర్మల తదితరులు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్స్‌లను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని నోడల్ అధికారి డాక్టర్ హెలెన్ నిర్మల అన్నారు. స్థానిక సుల్తానాబాదులో బుధవారం నోడల్ అధికారి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల మున్సిపల్ సిబ్బందితో కలసి ఆస్తి పన్నులను చెల్లించాలని క్షేత్రస్థాయిలో పర్యటించి డిమాండ్ నోటీసులను అందించారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలోని ప్రతి ఒక్కరూ ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్స్‌ను సకాలంలో చెల్లించాలని కోరారు. పట్టణ సుందరీకరణ, అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాలకు తావు లేకుండా రీ సర్వే

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ జియావుల్‌హక్ తెలిపారు. మండల పరిధిలోని వల్లభరావుపాలెంలో బుధవారం వ్యవసాయ భూముల రీ సర్వేను తహసీల్దార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వే బృందం సభ్యుల నుంచి వివరాలను సేకరించారు. రైతలతో మాట్లాడుతూ భూమి రీ సర్వేపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేల చెక్కు ఇచ్చి రూ.2 వేలకు టోకరా

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రూ.50వేలు చెక్కు ఆశ చూపి రూ.2 వేలు తీసుకుని అర్చక దంపతులకు టోకరా వేసిన వ్యక్తి ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలో అర్చకుడిగా పనిచేస్తున్న మారుతీ చక్రవర్తి వద్దకు గత నెల 30న నిట్టా శ్రీనివాసరావు అనే వ్యక్తి వచ్చాడు. మేము కూడా బ్రాహ్మణులమేనని, అత్యవసరంగా రెండు వేల రూపాయలు కావాల్సి వచ్చినవి, మీకు రూ.50వేలు చెక్కు హామీగా ఇస్తానని, సాయంత్రం వచ్చి డబ్బులు ఇచ్చి చెక్కు తీసుకెళతానని నమ్మించి నగదు తీసుకువెళ్లాడు. తరువాత అతని సెల్‌ఫోన్ నెంబరుకు ప్రయత్నిస్తుంటే స్విచ్ఛాఫ్ వస్తుందని అర్చకులు బుధవారం తెలిపారు.

జూదరుల అరెస్టు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పేకాడుతున్నారని అందిన సమాచారంతో దాడులు నిర్వహించనట్లు రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్ చెప్పారు. మండలంలోని కోపల్లె - గుడివాడ గ్రామాల మధ్య పంట పొలాల్లో బుధవారం పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.5200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సదరం రీ వెరిఫికేషన్ శిబిరం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం సదరం రీ వెరిఫికేషన్ శిబిరం ప్రారంభమైంది. వారంలో మూడు రోజులు జరిగే ఈ శిబిరంలో గతంలో వివిధ సమస్యలతో సదరం సర్టిఫికెట్ పొంది పించన్ పొందుతున్న వారు తిరిగి వారి అనారోగ్య సమస్యలను ధ్రువీకరించుకునేలా ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. వైసీపీ ప్రభుత్వంలో నిజమైన లబ్ధిదారులకు అందాల్సిన పించన్ పక్కదారి పట్టిందన్న ఆరోపణలు రావడంతో ప్రభుత్వం రీ వెరిఫికేషన్ చేపట్టిన విషయం విదితమే.